
పెద్దాపురం మండలం దివిలిలో చంద్రబాబు అభివాదం


రాజుపాలెంలో చంద్రబాబుతో మాట్లాడుతున్న ముంపు బాధిత మహిళ

అండగా ఉంటా.. ఆదుకుంటా!

- ఏలేరు వరద బాధితుల్లో ధైర్యం నింపిన సీఎం చంద్రబాబు
- బాధితులందరినీ అన్ని విధాలా ఆదుకుంటామని ప్రకటన
- రాజుపాలెం గ్రామానికి ఎక్స్‌కవేటర్‌పై వెళ్లి పలకరించిన సీఎం
- ముంపులో చిక్కుకున్న పెంకుటిళ్లు లోపలకు వెళ్లి బాధితులకు భరోసా
- ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు, దుస్తులు ఇవ్వనున్నట్టు వెల్లడి
- కుళ్లిన వరి కంకులను చంద్రబాబుకు చూపించి రైతుల ఆవేదన
- ఏలేరు ఆధునికీకరణ పూర్తి చేసే బాధ్యత ఎన్డీయేదేనని ప్రకటన
- వడ్లమూరులో రైతు ఇచ్చిన కొబ్బరి బొండం తాగిన చంద్రబాబు
- దివిలి వద్ద విద్యార్థులతో మాటామంతీ.. రాజుపాలెం వద్ద రైతులతో..
- సామర్లకోటలో దిగి.. అక్కడ నుంచి వెళ్లి ఏలేరు కాలువ పరిశీలన




కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో ముంపు ప్రాంతాలను ఎక్స్‌కవేటర్‌లో వెళ్లి పరిశీలిస్తున్న చంద్రబాబు.. నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం


రాజుపాలెంలో ఏలేరు కాలువను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు




పెద్దాపురం మండలం వడ్లమూరులో ఏలేరు కాలువ పరిశీలిస్తున్న చంద్రబాబు.. వరదకు దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న సీఎం

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/పెద్దాపురం/కిర్లంపూడి/సామర్లకోట, సెప్టెంబరు11: 'ఏలేరు వరద బాధితులకు అండగా ఉంటా. ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలి. ప్రతి వరద బాధిత కుటుంబానికి రూ.10వేలు సాయం చేస్తా.తక్షణం దుస్తులు పంపిణీ చేయిస్తా. పంటలు నష్టపోయిన అన్నదాతలకు హెక్టారుకు రూ.25వేల సాయం, ఎరువులు, పొటాషియం అందిస్తా. ఇళ్లు దెబ్బతిన్న వారికి ఇళ్లు కట్టిస్తాను' అని సీఎం చంద్రబాబు ధైర్యం చెప్పారు. ప్రతిఒక్కరికీ సాధ్యమైనంత వేగంగా సాయం పంపిణీ చేయిస్తామని వివరించారు. ఏలేరు వరద బాధిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు బుధవారం పర్యటించారు. మధ్యాహ్నం 1.53 గంటలకు సామర్లకోట జూనియర్ కాలేజీ మైదానంలో హెలీకాప్టర్‌లో దిగారు. అక్కడ నేతలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం నేరుగా కిర్లంపూడి మండలం రాజుపాలెం వరద ముంపు గ్రామం పరిశీలనకు వెళ్లారు. మార్గమధ్యలో బస్సు దిగి పెద్దాపురం మండలం వడ్లమూరు బ్రిడ్జిపై నుంచి ఏలేరు వరదను పరిశీలించారు. వరద తమ పొలాలను ఏవిధంగా ముంచేసిందో కొందరు రైతులు చంద్రబాబుకు వివరించారు. అనంతరం దివిలి సెంటర్‌లో బీఎస్సార్ కాలేజీ విద్యార్థులు సీఎం కోసం వేచి చూడగా వీరిని చూసి సీఎం బస్సు దిగారు. వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులు రూ.లక్ష చెక్కును ఏలేరు వరద బాధితుల సహాయం కోసం అందించారు. అక్కడి నుంచి సీఎం రాజుపాలెం గ్రామానికి చేరుకున్నారు. అప్పటికీ గ్రామంలో ఛాతివరకు వరద నీరు ప్రవహిస్తోంది. ఏలేరుకు గండిపడడంతో పూర్తిగా వరద ముంపులో చిక్కుకున్న గ్రామానికి సీఎం సాహసం చేసి ఎక్స్‌కవేటర్‌పైకి ఎక్కారు. పక్కనే ఏలేరు వరద ఉధృతి కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఎన్ని ఎకరాల మేర పంటలు మునిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వరద ముంపులో చిక్కుకున్న ఇళ్ల వద్దకు మోకాల్లోతు నీటిలోకి దిగి వెళ్లారు. తొలుత కాకాడ వసంతరావు ఇంటికి వెళ్లారు. ముంపుతో ఏ విధంగా నష్టపోయామో బాధితులు సీఎంకు వివరించగా పక్కనే ఉన్న కలెక్టర్‌ను పిలిచి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత వినకోటి కోటేశ్వరరావు, గణేశుల బాబురావు, చక్రవర్తుల సత్యన్నాయరణమ్మ, కేలంగి వెంకటలక్ష్మి, స్థానిక ఎస్సీ పేటకు చెందిన వికలాంగుడు దెయ్యాల నాగు తదితర కుటుంబాలతో చంద్రబాబు మాట్లాడారు. వరదకు ఇళ్ల ముంపుతో నష్టపోయిన తీరును చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. భూపాలపట్నంలో ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతిచెందడంతో ఆ విషయం తెలుసుకున్న చంద్రబాబు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి సీఎం రాజుపాలెం పంచాయతీకి చేరుకుని బాధితులకు నిత్యావసర సరుకులు అందించారు. కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లోని వరద ముంపు ప్రాంతాలను సందర్శించిన అనంతరం సీఎం చంద్రబాబు సామర్లకోట చేరుకుని జిల్లా ఉన్నతాధికారులతోను, ప్రజాప్రతినిధులతోను సమీక్షిస్తారని ముందుగా అధికారులు ప్రకటించారు. అందుకు అనుగుణంగా బుధవారం మధ్యాహ్నం సామర్లకోట టీటీడీసీ ఆవరణలో వరద ప్రాంతాల ఛాయా చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో బాధిత రైతులతో మమేకమైన సీఎం అక్కడ అధిక సమయం ఉండడంతో అప్పటికప్పుడు సామర్లకోటలోని కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీ సత్యనారాయణమూర్తిలు హెలీపాడ్ వద్దకు సీఎంకు వీడ్కోలు పలికేందుకు తరలివెళ్లారు.

ఏలేరు ఆధునికీకరణ బాధ్యత ఎన్డీయేదే..

ఏలేరు కాలువ ఆధునికీకరణ బాధ్యత పూర్తి బాధ్యత ఎన్డీయేదే అని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు కష్టాలు వచ్చాయన్నారు. ఏలేరు రిజర్వాయర్‌కు ఒకేసారి 47వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చిందని, కిందకు వదలకపోతే ప్రాజెక్టుకు ప్రమాదం కావడంతో వరద వదలారన్నారు. దీంతో పలు ప్రాంతాలు నీట మునిగాయన్నారు. వరదల కారణంగా జిల్లాలో 65 వేల ఎకరాలు పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. ఏలేరు వరదపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారన్నారు. వరద ఏలేరు కాలువల్లో ఎలా ప్రవహిస్తోంది. గండ్లు ఎక్కడ పడే అవకాశం ఉందనే దానిపై అధికారులు డ్రోన్ల ద్వారా చూసి కలెక్టర్ సమయస్ఫూర్తితో వ్యవహరించారన్నారు. కాగా సీఎం ప్రయాణించిన బస్సులో ఎమ్మెల్యేలు ఎక్కారు. కిర్లంపూడిలో వరద ప్రభావం గురించి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చంద్రబాబుకు వివరించారు. ఏలేరు రిజర్వాయరుకు వస్తోన్న ఇన్‌ఫ్లో, కాలువలకు గండ్ల పరిస్థితిని ఎమ్మెల్యే సత్యప్రభ వివరించారు. పిఠాపురం మునిగిన తీరును ఫొటోలతో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ చంద్రబాబుకు వివరించారు. బాబు వెంట ఎమ్మెల్యేలు యనమల దివ్య, పంతం నానాజీ, దాట్ల బుచ్చిరాజు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, చిక్కాల రామచంద్ర రావు, జ్యోతుల నవీన్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు ఉన్నారు.


కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

కన్నీళ్ల.. తాడిమళ్ల!

జీడిమామిడి పిక్కల కింద చితికిన కూలి బతుకులు.. మొత్తం ఏడుగురిని మింగేసిన చిన్నాయిగూడెం వ్యాను ప్రమాదం.. నలుగురు సురక్షితం

నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామం కన్నీళ్లతో నిండిపోయింది. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు జీడి మామిడి పిక్కల బస్తాల కింద చితికిపోయాయి. జట్టు కూలీలు 'జట్టు'గానే విగతజీవులయ్యారు. నిద్ర కోసం మూసిన కన్ను మూసినట్టుగానే ఊపిరి ఆగిపోయింది. అర్ధరాత్రి వేళ ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు.. ఒకే వీధికి చెందిన ముగ్గురు.. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు.. మరో ఊరికి చెందిన ఒకరిని వ్యాను ప్రమాదం రోడ్డు మింగేసింది. పన్నుల ఎగవేతకు యజమాని అడ్డదారిలో వెళ్లడం ఏడు కుటుంబాలను రోడ్డున పడేసింది.




వ్యాన్ బోల్తా ప్రమాదంలో మృతి చెందిన వారు వరుసగా.. తాడి కృష్ణ, తమ్మిరెడ్డి సత్యనారాయణ.. పెనుగుర్తి చిన ముసలయ్య.. దేశాల వీర వెంకట సత్యనారాయణ (బూరయ్య).. కత్తవ నారాయుడు.. కత్తవ కృష్ణ.. బొక్కా ప్రసాద్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తాడిమళ్లలో సుమారు 100 వరకూ జీడిపిక్కల ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ గ్రామంతోపాటు చుట్టుపక్కల వాళ్లకు ఇదే ప్రధాన జీవనాధారం. మహిళలు కూడా ఇంటివద్ద జీడిపప్పును వలుస్తూ పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతుంటారు. ఫ్యాక్టరీలకు అవసరమైన జీడిమామిడి పిక్కలను వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి తరలిస్తారు. జీడిపిక్కలను బస్తాల్లో పట్టడం, ఎగుమతి, దిగుమతికి జట్టు కూలీలు అవసరం. దీంతో తాడిమళ్ల చుట్టు పక్కల ప్రాంతాల్లోని మగవాళ్లు ఈ పనులకు వెళ్తారు. పైగా ఈమధ్య వర్షాల వల్ల వ్యవసాయ పనులు లేకపోవడంతో జీడిపిక్కల పనులపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ క్రమంలో కత్తవ కృష్ణ (మేస్త్రీ-40) ఆధ్వర్యంలో కత్తవ నారాయుడు(45), తాడి రామకృష్ణ (45), తమ్మిరెడ్డి సత్యనారాయణ (44), దేశాల వీర వెంకటరావు (బూరయ్య-40), బొక్కా ప్రసాద్ (35), పెనుగుర్తి చినముసలయ్య (35) జట్టుగా మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో డీసీఎం వ్యానులో బయలుదేరి ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలంలోని బొర్రంపాలెం వెళ్లారు. జీడిపిక్కలను బస్తాల్లోకి ఎత్తి ఎగుమతి చేసుకొని అక్కడి నుంచి రాత్రి బయలుదేరారు. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం దగ్గరలోని చిలకవారిపాకలు(పట్టాభిపురం) వద్ద 11.30 గంటల సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. సాధారణంగా జట్టు కూలీలు లోడుపైనే నిద్రిస్తారు. మృత్యువాత పడిన ఏడుగురు, ప్రాణాలతో బయటపడిన గంటా మధు జీడిపిక్కల లోడుపై పడుకున్నారు. క్యాబినులో మరో జట్టు కూలీ లోయ ఇమ్మానుయెల్‌రాజు, డ్రైవరు మాపటి శివాజీ కుమార్, క్లీనరు గంటి కిషోర్‌కుమార్ ఉన్నారు. వ్యాను కుదుపుల్లో జీడిపిక్కల బస్తాలపై నుంచి నిద్రిస్తున్న సమయంలో కింద పడిపోకుండా లోడుపైన ఓ రెండు వరుసలు జీడిపిక్కల బస్తాలను డొప్పలా వేసి మధ్యలో కూలీలు పడుకుంటారు. ఇదే స్థలంలో ఈ ఎనిమిది మంది నిద్రించారు. వ్యాను తాడిమళ్లకు సుమారు 15 కిలోమీటర్ల దూరంగా ఉండగా చిలకవారిపాకల వద్ద మలుపు తిరిగింది. కొద్ది దూరంలో కుడి వైపున గొయ్యి ఉండడంతో వ్యానును డ్రైవరు కాస్త ఎడమవైపునకు తిప్పాడు. రోడ్డు పక్కన కేవలం అరడుగు వెడల్పుతో గ్రావెల్ బెర్మ్ ఉంది. వర్షాలు అది లూజుగా తయారైంది. దీంతో వ్యాను టైర్లు ఈ బెర్మ్‌పైకి ఎక్కగానే జారిపోయింది. తుప్పలతో నిండిపోయి చిన్న లోయలోకి పూర్తిగా బోల్తా పడింది. దీంతో లోడుపై పడుకున్న వాళ్లు 15 టన్నుల లోడు బస్తాల కింద నలిగిపోయారు. ఈ వ్యానుకు ముందు వెళుతున్న వీళ్లకు చెందిన వ్యానులో ఫ్యాక్టరీ యజమాని మనిషి నక్కాకుల నాగబాబు మరో నలుగురు జట్టు కూలీలు ఉన్నారు. ప్రమాదానికి గురైన వ్యాను క్యాబిన్‌లోని ఇమ్మాన్యుయేల్, డ్రైవరు, క్లీనరు బయటకురాగా.. డ్రైవరు, క్లీనరు భయంతో పారిపోయారు. ఇమ్మాన్యుయేల్ ముందు వెళ్లిన వ్యానులోకి వారికి ఫోన్‌చేశాడు. దీంతో వాళ్లు, స్థానికులు వచ్చి బస్తాలు తీయడానికి శ్రమించారు. సుమారు 2 గంటలపాటు ప్రయత్నించి 8 మందినీ బయటకు తీశారు. ఈలోపు ఊపిరాడక ఏడుగురు దుర్మరణం చెందారు. లోడుపై పడుకున్న ఎనిమిది మందిలో గంటా మధు ప్రాణాలతో బయటపడ్డాడు. మృతుల్లో ఆరుగురిది నిడదవోలు మండలం తాడిమళ్లకాగా, బొక్కా ప్రసాద్(40)ది మండలంలోని ఉనకరమిల్లి గ్రామం. ఈ ప్రమాదంలో మృతి చెందినవారు అతిపేదవాళ్లు. మగవాళ్లు జీడిపిక్కలు, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుండగా.. ఆడవాళ్లు కొందరు జీడిపిక్క ఒలుపు చేస్తుంటారు. ఇందులో కత్తవ కృష్ణ, కత్తవ నారాయుడు వరుసకు సోదరులు, ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో ఉంటున్నారు. వీరు దేశాల వీర వెంకట్రావు ఒకే వీధిలో ఉంటారు. అలాగే.. మృతుల్లో బొక్కా ప్రసాద్‌ది ఉనకరమిల్లి కాగా డ్రైవరు, క్లీనరుతోసహా అందరిదీ తాడిమళ్లే.

● అడ్డదారులు రోడ్డున పడేశాయి

జీఎస్టీ, మార్కెట్ తదితర పన్నులు, టోల్‌ఫీజుల నుంచి తప్పించుకోడానికి అడ్డదారుల్లో సరుకును రవాణా చేయడం ఈ ప్రాంతంలో పరిపాటిగా మారిపోయింది. ఏడు కుటుంబాలు రోడ్డున పడితేగానీ ఈ తతంగం అధికారులకు కనిపించలేదు. వాస్తవానికి హెవీ లోడ్ వాహనాలు తిరగడానికి పనిచేయని మార్గాల్లో జీడిపిక్కలను రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. ఇప్పుడు ప్రమాదానికి గురైన వ్యాను జంగారెడ్డిగూడెం నుంచి హైవేలో తాడిమళ్ల చేరుకోవచ్చు. కానీ సింగిల్ రోడ్ల వెంబడి ప్రయాణించింది. గురవయ్యగూడెం, లక్ష్మవరం కట్ట, పోతవరం, చిన్నాయగూడెం, యర్నగూడెం మీదుగా తాడిమళ్ల వెళుతోంది. ప్రమాదానికి గురైన వ్యాను చిమ్మచీకటిలో సింగిల్ రోడ్డులో వెళుతుండగా కుడివైపున గొయ్యిని తప్పించబోయి ప్రమాదానికి గురైనట్టు తెలుస్తోంది. నేషనల్ లారీలపై దూర ప్రాంతాలకు తిరిగిన అనుభవం డ్రైవరుకు ఉందని చెబుతున్నారు. దీంతో అడ్డదారే కొంపముంచిందని తెలుస్తోంది.

● ఎలా జరిగిందంటే.. మృత్యుంజయుడు మధు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11: జీడిపిక్కల లోడు కోసం మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో తాడిమళ్ల నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లాం. అక్కడి రైతుల దగ్గర కొన్ని జీడిపిక్కలను లోడు చేసుకుని తాడిమళ్లకు రాత్రి 8.30, 9 గంటల సమయంలో బయలుదేరాం. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో మా వాహనం బోల్తాపడింది. చుట్టూ చీకటి. అసలు ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలియలేదు. అతికష్టం మీద ప్రాణాలతో బయటపడ్డాను అని ఈ దుర్ఘటనలో మృత్యుంజయుడిగా నిలిచిన తాడిమళ్లకు చెందిన గంటా మధు అన్నారు. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం శివార్లలో జరిగిన దుర్ఘటనలో కవుకు దెబ్బలుతిని, ప్రాణాలతో బయటపడిన మధును గోపాలపురం ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మధు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మేమంతా తాడిమళ్ల నుంచి 11 మందిమి జీడిపిక్కల లోడు కోసం వెళ్లాం. తిరిగి వచ్చేటప్పుడు ఇద్దరు కేబిన్‌లోకి ఎక్కారు. మిగిలిన వాళ్లం మేం పైకి ఎక్కాం. మేం ఎక్కిన వ్యాన్ ఒక్కసారిగా తిరగబడిపోయింది. చాలాసేపటి తర్వాత మా ఊరు వాళ్లు, చుట్టుపక్కల గ్రామాలవాళ్లు వచ్చారు. అప్పటికే జీడిపిక్కల బస్తాలు మీద పడిపోయాయి. ఊపిరాడలేదు. ఆ చీకట్లో హాహాకారాలు తప్ప ఎవరు ఎక్కడ పడ్డారో తెలియలేదు. వ్యాన్ నెమ్మదిగా ఆగుతుండడంతో మా ఊరు వచ్చేసింది అనుకున్నా. ఈలోపే కింద పడిపోయాను. నాపై పిక్కల బస్తాలు పడ్డాయి. నడుము, కాళ్లపైన బస్తాలు పడ్డాయి. మీదపడిన జీడిపిక్కల బస్తాలను చేతులతో ఆపుకుంటూ కిందున్న మట్టిని చేతులతో ఖాళీ చేసుకుంటూ నెమ్మదిగా బయటకు వచ్చానని పేర్కొన్నాడు.


జీజీహెచ్‌లో గంటా మధు




చిన్నాయిగూడెం వద్ద వ్యాన్ ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలు.. ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్



క్యాబిన్‌లో అలవాటు : లోయ ఇమ్మాన్యేల్ రాజు, ప్రమాదంలో బయటపడిన యువకుడు

మాది కూడా తాడిమళ్ల. అందరం జట్టు కూలీలుగా పని చేస్తాం. ఈ మధ్య వ్యవసాయ పనులు లేకపోవడంతో వీటికే వెళ్తున్నాం. నాకు క్యాబిన్‌లో పడుకుంటే నిద్రపడుతుంది. అందువల్ల క్యాబిన్‌లో ఎక్కాను. ప్రమాదం జరిగినప్పుడు పడుకొని ఉన్నాను. వ్యాన్ తిరగబడ్డాక క్యాబిన్ పైకి వచ్చి ఫోన్లు చేశాను. ఈలోపు అందరూ వచ్చారు. సుమారు 2 గంటలు కష్టపడి అందర్నీ బయటకు తీశాం.


మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న దుర్గేష్


మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న శేషారావు

ప్రభుత్వ సాయం రూ.5 లక్షలు

కొవ్వూరు/నిడదవోలు, సెప్టెంబరు 11: వ్యాన్ ప్రమా దంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయంగా ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. దీన్ని వెంటనే చెక్కుల రూపంలో మంత్రి కందుల దుర్గేష్ మృతుల కుటుంబాల ఇళ్లకు వెళ్లి బుధవారం సాయంత్రం అందజేశారు. అలాగే తన వంతు సాయంగా మరో రూ.25 వేలను అందించగా, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు రూ.20 వేల చొప్పున అందజేశారు. జీడిగింజల ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా ఒక్కొక్కరికీ రూ. 3లక్షల వంతున మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించింది. అలాగే వాహన ఇన్సూరెన్సు కంపెనీ నుంచి, ఇన్సూరెన్సు, కార్మిక సంక్షేమ బోర్డు నుంచిగాని ఇంకా ఇతర బెనిఫిట్స్ ఏమున్నా అందించి ఆదుకోవడం జరుగుతుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజులు వెల్లడించారు. కాగా ఈ ఘటనపై ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

జిల్లాలో బ్యాంకు లింకేజీగా 4899 గ్రూపులకు రూ.439.50 కోట్లు మంజూరు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు11: జిల్లాలో స్వయం సహాయక సంఘాలలోని 4899 గ్రూపులకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.439.50 కోట్ల బ్యాంకు లింకేజీ మంజూరు చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఆర్‌డిఏ, మత్స్యశాఖ, ఉద్యానవనశాఖ, పారిశ్రామికశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీనిధి పథకం ద్వారా ఇప్పటివరకు 13,695 స్వయం సహాయక సంఘాలకు రూ 77.18 కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. మహిళామార్ట్‌ల ద్వారా లక్ష్యం మేరకు అమ్మకాలు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక పెట్టుబడి నిధులు నూరుశాతం వసూలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చెందే దిశగా నూతనంగా యూనిట్ల ఏర్పాటు లోన్ల మంజూరు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలకు జీవనోపాధి కలిగించి అభివృద్ధిపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, డీపీఎంలు ఏ గణేష్, వై జనార్దనరావు ఎస్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



పిఠాపురం మండలం గోకివాడలో ఏలేరు వరద ఉధృతితో ఏకమైన పొలాలు, రహదారి

> ఏలేరు వరదతో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం అతలాకుతలమైంది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. కాలువలకు భారీ గండ్లు పడ్డాయి. పలుచోట్ల పంట కాలువలు చిన్నాభిన్నమయ్యాయి. పంట పొలాల్లో ముంపు భారీగా పెరిగింది. ఇన్‌ఫ్లోస్ తగ్గించామని ఏలేరు ఇరిగేషన్ అధికారులు చెప్తున్నా ఉధృతి మాత్రం తగ్గలేదు.

- పిఠాపురం నియోజకవర్గం అతలాకుతలం
- కాలువలకు ఇరవై ఐదుకి పైగా గండ్లు
- పంట పొలాల్లో పెరిగిన ముంపు
- ఏలేరుకు ఇన్‌ఫ్లోస్ తగ్గినా అదే స్థాయిలో వరద ఉధృతి

వీడని ఏలేరు వరద

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 11: పిఠాపురం నియోజకవర్గాన్ని ఏలేరు వరద చుట్టుముట్టి జనజీవనాన్ని, పంటలను కకావికలం చేసింది. పంట పొలాలు జలాశయాలు, సముద్రాన్ని తలపిస్తున్నాయి. ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదలైన వరద నీటికి సుద్దగడ్డ వరద ఉధృతి తోడవ్వడంతో పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు రెండు మండలాల పరిధిలోని గ్రామాల్లో 21వేల ఎకరాల్లో వరి, పత్తి, కాయగూర పంటలు ముంపులో కొనసాగుతున్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్, పట్టణాల పరిధిలోని పంట పొలాలు వరద నీటితో సముద్రాన్ని తలపిస్తున్నాయి. కొత్తపల్లి మండలాన్ని కూడా ఏలేరు వరద ముంచెత్తింది. ఇక్కడ నాలుగు వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీట మునిగాయి.

ఏలేరు వరద ఉధృతికి భారీగా గండ్లు పడ్డాయి. బుధవారం సాయంత్రం వరకు గొర్రిఖండి, నక్కలఖండి, పిప్పికాలువ, గొల్లప్రోలు కాలువ, పిడిందొడ్డి, ఎదురొడ్డి, బాడవ, పులిదొడ్డి, తుపాకిగడ్డ సహా పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఏలేరు నీరు ప్రవహించే కాలువలకు 25గండ్లు పడ్డాయి. ఇందులో పదికి పైగా గండ్లు అతి భారీగా ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. పలుచోట్ల గట్లు తెగిపోయినట్టు రైతులు తెలిపారు. కొన్నిచోట్ల గట్లు కనిపించని పరిస్థితి ఉంది. ఏలేరు, సుద్దగడ్డ వరదతో గొల్లప్రోలు పట్టణంలోని కాలనీల్లో వరద ముంపు గణనీయంగా పెరిగింది. గొల్లప్రోలులోని గాంధీనగరం, మార్కండేయపురం, రాయవరం రోడ్డు, ఎస్సీ కాలనీ, అరుంధతీయపేట, సూరంపేట, జగనన్న కాలనీ, శివాలయమాన్యం ప్రాంతాలన్నీ వరద ముంపులో చిక్కుకున్నాయి. గాంధీనగర్, రాయవరం రోడ్డు ప్రాంతాల్లో రెండున్నర, మూడు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తోంది. సూరంపేట, జగనన్న కాలనీకి బోట్లులోనే రాకపోకలు సాగుతున్నాయి. ఒక్క గొల్లప్రోలు పట్టణంలోనే 2,500 కుటుంబాలు వరద ప్రభావానికి గురయ్యాయి. వెయ్యికి పైగా గృహాలు ముంపులో చిక్కుకున్నాయి. పిఠాపురం పట్టణంలోని రాపర్తి రోడ్డు, అగ్రహారం మెట్ట శివారు ప్రాంతాల్లోని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. పట్టణంలోని కోర్టుల నుంచి ఇల్లింద్రాడ వరకు అరకిలో మీటరు మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు.

కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయ రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. గొల్లప్రోలు బైపాస్ రోడ్డు, టోల్‌ప్లాజా, ఇల్లింద్రాడ, పిఠాపురం బైపాస్‌రోడ్డులో రాపర్తి జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా ఎనిమిది ప్రాంతాల్లో బుధవారం ఏలేరు వరద నీరు ప్రవహించింది. దీంతో మంగళవారం సాయంత్రం నుంచి ఈ రహదారిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. రాత్రి ఎటువంటి వాహనాలు వరద నీటిలోకి వెళ్లకుండా బారికేడ్లు పెట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం వరద ఉధృతి కొనసాగడంతో సాయంత్రం వరకు వాహనాలను పోలీసులు అనుమతించలేదు. అయితే పలువురు వాహనచోదకులు ప్రమాదమని తెలిసినా వరద నీటిని దాటేందుకు ప్రయత్నం చేసి చిక్కుల్లో పడ్డారు. వాహనాలు పక్కకు లాగేయడంతో కొందరు ఇబ్బందులకు గురయ్యారు. జాతీయ రహదారిపై ప్రవాహ ఉధృతి సాయంత్రం స్వల్పంగా తగ్గుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుంచి రాకపోకలకు అనుమతి ఇచ్చారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకూ ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. అనంతరం పునరుద్ధరించారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



గొల్లప్రోలు గాంధీనగర్‌లో ఏలేరు వరద నీటిలో మునిగిన గృహాలు



రమణక్కపేటలో వరద నీటిలో చిక్కుకున్న దేవాలయం

కొత్తపల్లిని ముంచెత్తింది

- 4వేల ఎకరాల్లో పంటలు మునక
- 750 ఇళ్లల్లోకి వరద నీరు
- పునరావాస కేంద్రాల్లో బాధితులకు భోజనం: తహసీల్దారు

కొత్తపల్లి, సెప్టెంబరు 11: ఏలేరు రిజర్వాయర్‌లో అదనపు నీటిని కిందికి విడుదల చేయడంతో మండలంలో పలు గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. కొండెవరం, ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, యండపల్లి, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో 4వేల ఎకరాల్లో సార్వా పంట పూర్తిగా ముంపునకు గురైంది. కొండెవరం శివారు కాశీవారి పాకలులో 70, కొండెవరం శివారు ఇందిరానగర్‌లో 80, యండపల్లి శివారు తోటూరులో 30, కొత్త ఇసుకపల్లిలో జగనన్న కాలనీలో 60, నాగులాపల్లి ఎస్సీపేటలో 200, పాత ఇసుకపల్లి బీసీ కాలనీలో 140, రమణక్కపేటలో 150 ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. రమణక్కపేటలో దేవాలయ ప్రాంగణం వరద నీటితో మునిగింది. వరద ముంపునకు గురైన గ్రామాల్లో బాధితులకు స్థానికంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి తగ్గే వరకు బాధితులకు భోజన సదుపాయం కల్పిస్తామని తహసీల్దారు చిన్నారావు తెలిపారు.

వరద బాధితులకు భోజనం పంపిణీ చేయడానికి వెళ్లి...

నీటిలో వ్యక్తి గల్లంతు, మృతదేహం లభ్యం

కిర్లంపూడి, సెప్టెంబరు 11: ఏలేరు వరద నీటి ప్రవాహంలో గల్లంతై ఓ వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన గొంతిన సుబ్బారావు (35) మంగళవారం రాత్రి వరద బాధితులకు భోజనం పంపిణీకి వెళ్లాడు. తిరిగి వస్తుండగా వరదనీటిలో గల్లంతయ్యాడు. రాత్రి నుంచీ వెదకగా బుధవారం ఉదయం ముంపు కాలనీలో ఓ చోట సుబ్బారావు మృతదేహం తేలియాడింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. హెచ్‌సీ ఎస్.వెంకటరమణ కేసు నమోదు చేశారు.

సూరంపేటలో వ్యక్తి మృతి

బోటులో మృతదేహం తరలింపు... వరద నీటిలో అంత్యక్రియల నిర్వహణకు అగచాట్లు

గొల్లప్రోలు, సెప్టెంబరు 11: చనిపోయిన వ్యక్తికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకూ ఇబ్బందులు తప్పలేదు. వరద నీటిలోనే మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేటకు చెందిన ఇసరపు సూరిబాబు (62) బుధవారం మరణించాడు. సూరంపేట చుట్టూ ఏలేరు, సుద్దగడ్డ వరద నీరు ఉండటడతో అంతిమ సంస్కారాలు ఎలా నిర్వహించాలో తెలియక సంబంధీకులు సతమతమయ్యారు. అక్కడ ఉన్న జనసైనికులు, స్థానికులు విషయాన్ని గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి బోటు ఏర్పాటు చేశారు. వీఆర్వో వరమేశ్వరరాజు దగ్గరుండి బోటుపై మృతదేహాన్ని సూరంపేట నుంచి పట్టణంలోకి తీసుకువచ్చారు. అక్కడి నుంచి వరద నీటిని దాటి మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపారు



వరద నీటిలో మృతదేహాన్ని బోటులో తరలిస్తున్న దృశ్యం



వరద నీటిలోనే మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న దృశ్యం



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ఎగువున వరద నీరు

ఎగువన తగ్గుతూ...

ధవళేశ్వరం వద్ద పెరుగుతూ

- కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- రాత్రి 7 గంటలకు 15.10 అడుగులకు చేరిన నీటిమట్టం
- 15 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం/రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన భద్రాచలం వద్ద తగ్గుముఖం పడుతూండగా ధవళేశ్వరం వద్ద మరింత పెరుగుతోంది. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 13 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహించింది. ఆపై క్రమంగా పెరుగుతూ నీటిమట్టం రాత్రి 7గంటలకు 15.10 అడుగులకు చేరుకోగా 15,06,089 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. మరో 30వేల క్యూసెక్కుల వరద పెరిగి ఆపై తగ్గుదల నమోదు కావచ్చని అధికారుల అంచనా. ఎగురున భద్రాచలం వద్ద బుధవారం ఉదయానికి 50.50 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం తగ్గుముఖం పట్టి రాత్రి 7గంటలకు 48.40 అడుగులుగా నమోదైంది.

- ధవళేశ్వరం వరద ఉధృతి కారణంగా గోదావరి లంకల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రజలు ఘాట్లలో స్నానాలకు దిగకుండా పోలీసులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులకు 24 గంటలూ మూడు షిఫ్టుల కింద డ్యూటీలు వేశారు.
- మరోవైపు వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు నిబంధనలు విధించారు. ప్రజలెవరూ విగ్రహాలను నేరుగా నిమజ్జనం చేయడానికి వీలులేదన్నారు. విగ్రహాలను రేవుల వద్ద అధికారులకు అప్పగిస్తే వారే నిమజ్జనం చేస్తారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు.



లంక గ్రామాల ప్రజలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ సమీపంలోని మున్సిపల్ కల్యాణ మండపంలో ఆశ్రయం కల్పించిన దృశ్యం

విద్యుతాఘాతంతో తాపీమేస్త్రీ మృతి

ఎటపాక, సెప్టెంబరు 11: ఎటపాకకు చెందిన తాపీమేస్త్రీ డేగల నర్సింహారావు (42) స్థానికంగా ఓ ఇంటి రెండో అంతస్తు గదికి ప్లాస్టింగ్ కోసం (పరంజీ) బుధవారం సెంట్రింగ్ కర్రలు అమర్చుతున్నాడు. ఆ సమయంలో సెంట్రింగ్ కర్ర పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైరును తాకడంతో విద్యుతాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

నేటి నుంచి థర్మల్ డ్రోన్‌తో

చిరుత పులి గాలింపు



దివాన్‌చెరువు, సెప్టెంబరు 11: 'చిరుత పులి జాడను గుర్తించేందుకు గురువారం నుంచి థర్మల్ డ్రోన్ వినియోగిస్తాం.... ఇందుకు ప్రత్యేక బృందం వస్తోందని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి బుధవారం రాత్రి తెలిపారు. గత రెండు రోజులుగా సాధారణ డ్రోన్ సహాయంతో గాలించినా చిరుతపులి జాడ కనిపించలేదన్నారు. దీంతో థర్మల్ డ్రోన్ రప్పించామని చెప్పారు. దానిని ఆపరేట్ చేసేందుకు కుడా అనుభవజ్ఞులైన ఆపరేటర్లు ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో వేరే ప్రాంతం నుంచి తీసుకు వస్తున్నామన్నారు. థర్మల్ డ్రోన్‌తో పగటి పూటతో పాటు రాత్రి కూడా గాలింపు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా బుధవారం కూడా ట్రాప్ కెమెరాలో చిరుత పులి జాడ కనిపించలేదన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం కోసం ట్రాప్ కెమెరాల అమరికలో మార్పుటు చేసినట్టు చెప్పారు. చిరుత సంచారం బట్టి అనుమానాస్పద ప్రాంతంలో రెండు ట్రాప్ బోనులను స్థానాలు మార్చి దానిని పట్టుకునేందుకు పూర్తి ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో

ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

అన్నవరం, సెప్టెంబరు 11: అన్నవరం దత్తత దేవాలయమైన కోరుకొండ ఆలయానికి సంబంధించి వివిధ పద్దుల కింద వసూలైన నిధుల్లో సుమారు రూ.15 లక్షలు గోల్‌మాల్ అయిన వ్యవహారంలో జూనియర్ అసిస్టెంట్ కొంతం సతీష్, రికార్డ్ అసిస్టెంట్లు టి.అనిల్‌కుమార్, ఆర్.రవికుమార్‌లను బాధ్యులు చేశారు. వారు ముగ్గురినీ సస్పెండ్ చేస్తూ ఈవో రామచంద్రమోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారంలోపు సంజాయిషీ ఇవ్వాలని, లేకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన కిషోర్‌కుమార్, ప్రస్తుత లీజుల విభాగం సూపరింటెండెంట్ కాపారపు శివలకు పర్యవేక్షణ లోపం కారణంగా చార్జి మెమో ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. వీరితో పాటు అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై వెళ్లిన ఉప కమిషనరు రమేష్‌బాబు, ఏఈవో శ్రీనివాసరావులను ఈ వ్యవహారానికి సంబంధించి దేవదాయ శాఖ కమిషనరు దృష్టిలో పెట్టి అక్కడి నుంచి వివరణ తీసుకునేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది.



ఆలయానికి చేరిన పవిత్రాలను చూపిస్తున్న అర్చకులు, అధికారులు

అంతర్వేదిలో నేటి నుంచి

పవిత్రోత్సవాలు

అంతర్వేది, సెప్టెంబరు 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి నాలుగు రోజులు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి ప్రత్యేక పూజలు చేయించిన పవిత్రాలను అంతర్వేది తీసుకొచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఉత్సవాలను తిలకించాలని ఆయన కోరారు.

వరద నీటిలో మునిగి రైతు మృతి

ఎటపాక, సెప్టెంబరు 11: పశువుల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరి వరద నీటిలో మునిగి గిరిజన రైతు మృతి చెందాడు. మండలంలోని కృష్ణవరం పంచాయతీ గొందిరాజుపేట గిరిజన గ్రామానికి చెందిన రైతు కౌలూరి సూరిబాబు (37) బుధవారం సాయంత్రం ఇంటి వెనుక శివారు ప్రాంతంలో మేతకు వెళ్లిన తమ బంధువుల పశువులను తోలుకొచ్చేందుకు వెళ్లాడు. గోదావరి వరదతో నిండిన గ్రావెల్ గోతిలో పడి మునిగిపోయాడు. ఎంతసేపటికీ రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఆరా తీసి వెంటనే అక్కడకు వెళ్లారు. వరద నీటిలో పడిన ఆనవాళ్లను గుర్తించారు. గాలింపు చర్యలు చేపట్టగా సూరిబాబు మృతదేహం లభ్యమైంది. సూరిబాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సూరిబాబు (పాత చిత్రం)

321 మంది సీఆర్‌టీల కొనసాగింపునకు ఉత్తర్వులు

ఎమ్మెల్యే శిరీష చొరవతో స్పందించిన కమిషనరు

రంపచోడవరం, సెప్టెంబరు 11: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో కాంట్రాక్టు టీచర్లను కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం బుధవారం ఆదేశాలు జారీ చేశారని ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే శిరీషదేవి చొరవతో కమిషనరు స్పందించారు. ఆయా విద్యాలయాల్లో ఉన్న ఖాళీల ఆధారంగా 321 మంది సీఆర్‌టీలను మరో ఏడాది కొనసాగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొలిక్కిరాని సత్యదేవుడి విమాన గోపురం

స్వర్ణ తాపడం అంచనాలు

- చదరపు అడుగుకు 25 గ్రాముల బంగారమైతే 72 కిలోలు
- 5 గ్రాముల చొప్పునైతే 15 కిలోల బంగారం అవసరం

అన్నవరం, సెప్టెంబరు 11: రత్నగిరివాసుడైన సత్యదేవుడి విమాన గోపురం స్వర్ణతాపడం అంచనాలు ఇంకా కొలిక్కిరాలేదు. తిరుమల తిరుపతి దేవస్థానం బృందం సుమారు 114 కిలోల బంగారం పడుతుందని, 90 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈవో రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు రిటైర్డ్ డిప్యూటీ స్థపతి బుధవారం వచ్చి పరిశీలించారు. చుట్టూ ఉన్న నాలుగు గోపురాలు మినహాయిస్తే చదరపు అడుగుకు రాగిరేకుపై 25 గ్రాముల బంగారం వినియోగిస్తే సుమారు 72 కిలోలు అవసరం ఉంటుందని, దీనికి సుమారు రూ.60 కోట్లు వ్యయం అవుతుందని లెక్కగట్టారు. అయితే ధ్వజస్తంభానికి అడుగుకు 5 గ్రాముల బంగారం వినియోగించగా... ఆ ప్రకారం 15 కిలోల బంగారం సరిపోతుందని, రూ.15 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ రెండు ప్రతిపాదనలను ఈవో రామచంద్రమోహన్ దృష్టిలో పెట్టి దేవదాయ శాఖ కమిషనరు ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

వై.రామవరం, సెప్టెంబరు 11: మండలంలోని పసిరిగిన్ని గ్రామానికి చెందిన చోళ్ల అచ్చియ్యమ్మ మోహనాపురంలోని అత్తింటి నుంచి మంగళవారం సాయంత్రం పి.యర్రగొండలోని వదిన ఇంటికొచ్చింది. బుధవారం ఉదయం డాబాపై చీరలు ఆరేస్తుండగా 33 కేవీ విద్యుత్ వైర్లు తగిలి గాయపడింది. గాయపడిన అచ్చియ్యమ్మను వై.రామవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు శరీరం 60శాతానికి పైగా కాలడంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేసినట్టు వైద్యాధికారి రాహుల్ చెప్పారు..

ఏజెన్సీ సమాచారం



చింతూరులో వరద ముంపులో ఇళ్లు

వరద ప్రభావిత గ్రామాల్లో గిరిజనుల ఇక్కట్లు

ట్రాక్టర్‌పై ఆసుపత్రికి గర్భిణి తరలింపు



చింతూరు, సెప్టెంబరు 11: మండలంలో వరద ఇక్కట్లు అంతకంతకూ పెరుగుతున్నాయి. 22 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అక్కడి ప్రజలంతా నాలుగు రోజులుగా నిత్యావసరాలు, వైద్యం అందక నానా ఇక్కట్లు పడుతున్నారు. కాలినడకతో పాటు నాటు పడవలే వారికి ఆధారమయ్యాయి. వ్యాధిగ్రస్థులను, గర్భిణులను ఆసుపత్రులకు చేర్చేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కుమ్మూరుకు చెందిన గర్భిణి రమణకుమారిని ఏడుగురాళ్ళపల్లి ఆసుపత్రికి మంగళవారం రాత్రి ట్రాక్టర్‌పై తరలించారు. చింతూరు వద్ద శబరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి ఒక్క అడుగు తగ్గి 44 అడుగుల మేర ప్రవహిస్తోంది.

'ప్రవాహం తగ్గే వరకు వాగులు దాటొద్దు'

మోతుగూడెం, సెప్టెంబరు 11: మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీ సోకులేరు వాగు, ఏజెన్సీలో కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రవాహం తగ్గే వరకు ఎవరూ వాటిని దాటవద్దని మోతుగూడెం ఎస్‌ఐ జి.గోపాలరావు ఆదేశించారు. సోకులేరుతో పాటు ఉధృతంగా ప్రవహిస్తున్న కొత్తపల్లి, పొల్లూరు గ్రామాలను, సీలేరు నదిని బుధవారం ఆయన పరిశీలించారు. చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. వాగుల వద్ద పోలీసు పహారా ఏర్పాటు చేశామని, ఎవరూ వాగులోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. తులసిపాక-మారేడుమిల్లి ఘాట్ రోడ్డుపై భారీ వాహనాలను నిలిపివేశామని ఎస్‌ఐ చెప్పారు.

పాడేరు వైసీపీ ఎమ్మెల్యే వద్దన్నారు.... రంప బదిలీ చేశారు

చర్చనీయాంశంగా గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ బదిలీ వ్యవహారం

రంపచోడవరం, సెప్టెంబరు 11: పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు ఐ.కోటేశ్వరరావును పరిపాలనా అత్యవసారాలరీత్యా రంపచోడవరంలో ఖాళీగా ఉన్న డీడీ పోస్టుకు బదిలీ చేశారు. ఈ బదిలీ వెనుక అక్కడి వైసీపీ ఎమ్మెల్యే ఉన్నారన్న విషయం చర్చనీయాంశంగా మారింది. అంతకు మించి అక్కడ ఐటీడీఏ పీవో-డిప్యూటీ డైరెక్టర్ మధ్య ఉన్న విబేధాలు కూడా కారణమని తెలుస్తోంది. వైసీపీ ఎమ్మెల్యే సదరు డీడీపై కలెక్టరుకు పిర్యాదు చేసిన నాలుగు రోజులకే ఈ బదిలీ జరగడంతో దీని వెనుక రాజకీయ కోణం ఉందన్న చర్చ సాగుతోంది.



వీఆర్ పురం-కూనవరం మధ్య శబరి వంతెనపై ఉధృతంగా వరద ప్రవాహం

ఇంకా వరద నీటిలోనే గ్రామాలు

వర రామచంద్రాపురం, సెప్టెంబరు 11: గోదావరికి వరద కొనసాగుతుండడంతో మండలంలోని ఒడ్డిగూడెం, ఒడ్డిగూడెం బీసీ కాలని, ధర్మతాళ్ళగూడెం, శ్రీరామగిరి, చింతరేవుపల్లి గ్రామాలు రెండు రోజులుగా వరద నీటిలోనే ఉన్నాయి. బాధితులు చేసేదేమీ లేక మూటాముళ్లు సర్దుకుని ఇదేమి ఖర్మరా అనుకుంటూ పునరావాస కేంద్రాలకు వెళ్తున్నారు. చంటి పిల్లలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉల్లిపాయలు, పప్పు, నూనెతో సరిపెడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపు మండలాల వరద బాధితులకు నిత్యావసర సరకులు కాకుండా పోలవరం పరిహారం ఇచ్చి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

కూనవరం: ఉగ్రరూపం దాల్చిన శబరి బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నిలకడగా ఉండడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కూనవరం ప్రజలు పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తమకు పరిహారం ఇవ్వాలంటూ గిన్నెల బజారులో నిర్వాసితులు జలదీక్ష చేపట్టారు. ప్రతిఏటా తామీ బాధను భరించలేకపోతున్నామని, వరదల కారణంగా పనులు కూడా ఉండట్లేదన్నారు. వ్యాపారస్తులకు సైతం వ్యాపారాలు లేక దుకాణాలు బోసిపోతున్నాయన్నారు. సరైన సమయంలో పండించలేక పంటలు దిగుబడి కూడా రావట్లేదన్నారు. జలదీక్ష చేపట్టిన నిర్వాసితుల వద్దకు కూనవరం ఎస్‌ఐ శ్రీనివాస్ వెళ్లి నిర్వాసితులకు నచ్చజెప్పి విరమింపజేశారు. మండలంలోని పలు గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే వున్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం-వీఆర్ పురం మధ్య శబరి బ్రిడ్జిపై నుంచి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది.

ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి



రంపచోడవరం, సెప్టెంబరు 11: కాకినాడ జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని బుధవారం రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి కలిశారు. ఏజెన్సీ ముంపు బాధితుల సమస్యలను ఆమె సీఎంకి వివరించారు. విలీన మండలాల్లో చాలా గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయని, బాధితులను తక్షణం ఆదుకోవాలని కోరారు.

డొంకరాయి డీఏవీ పాఠశాలలో కొండచిలువ హల్‌చల్



మోతుగూడెం, సెప్టెంబరు 11: వై.రామవరం మండలం డొంకరాయి డీఏవీ పాఠశాలలో ఓ కొండ చిలువ భయకంపితుల్ని చేసింది. ఎల్‌కేజీ రూమ్‌లో బెంచ్ మీద పడుకుని ఉంది. బుధవారం ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన ఆయా పాఠశాల గదులు తుడవడానికి వెళ్లా బెంచ్ మీద ఉన్న కొండ చిలువను చూసి భయంతో ఉపాధ్యాయులకు చెప్పింది. ఆయా కొడుకు అశోక్ వచ్చి కొండ చిలువను పట్టుకుని అడవిలో విడిచిపెట్టాడు.

వైద్యుల నిరసన

రాజవొమ్మంగి, సెప్టెంబరు 11: రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.85 జారీ చేయడాన్ని నిరసిస్తూ రాజవొమ్మంగిలో వైద్యాధికారులు సుష్మ, సరోజ్ బుధవారం నల్ల రిబ్బన్లు ధరించి ప్రజలకు వైద్య సేవలు అందించారు. జీవో నెం.85 ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చెట్లు నరికి రోడ్డుపై పడేసి గిరిజనుల వినూత్న నిరసన



కూనవరం, సెప్టెంబరు 11: వరదల సమయంలో కూనవరం నుంచి భద్రాచలం వెళ్లేందుకు బోదునూరు-ఏడుగురాళ్లపల్లి మార్గమే శరణ్యం. వరద ఎన్ని అడుగులు వచ్చినా ఈ మార్గంలో భద్రాచలం వెళ్లచ్చు. వరదల సమయంలో అత్యవసరంగా రోగులను సైతం అంబులెన్స్‌లో ఇటువైపే తీసుకెళ్తారు. నిత్యావసర వస్తువులను భద్రాచలం నుంచి దిగుమతి చేసుకుంటారు. అయితే ఈ మార్గానికి రహదారి నిర్మాణానికి అటవీ శాఖ నుంచి ఏళ్ల తరబడి అనుమతి రావట్లేదు. దీంతో చిర్రెత్తిన గిరిజనులు ఇక్కడ రోడ్డు నిర్మాణానికి అనుమతించాలంటూ అడవిలో చెట్లు నరికి రోడ్డుకు అడ్డంగా వేసి బుధవారం నిరసన తెలిపారు. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలిగింది. చివరకు ఫారెస్టు, ఇతర శాఖాధికారులు వెళ్లి రోడ్డుపై అడ్డంగా వేసిన చెట్లను తొలగించారు.

14న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాక

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11 : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈనెల 14న రాజమహేంద్రవరం రానున్నారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌ను ఆనుకుని నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనాలు, హాస్టల్ భవనాల పనులను ఆయన పరిశీలిస్తారు. అధికారులతోను ఆయన సమీక్షించే అవకాశం ఉంది. ఈమేరకు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఒక సర్క్యులర్ జారీ చేస్తూ, అందరు హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ, పారామెడికల్ అండ్ సపోర్టింగ్ స్టాఫ్ అంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వార్డులు, క్లినికల్ ఏరియాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

90శాతం రాయితీపై మినీ గోకులం పథకం

● రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 11: రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలం కాతేరులో ఏర్పాటుచేసిన పశువుల్లో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగణాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దీనిలో భాగంగా పశువుల షెడ్లు నిర్మించుకునేందుకు 90శాతం రాయితీపై ఎంజీఎన్ఆర్జీఎస్ కింద మినీ గోకులం పథకం అమలుచేస్తామన్నారు. పెయ్యి దూడలు మాత్రమే జన్మించేందుకు ప్రత్యేక ఇంజక్షన్‌ను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్క పాడిరైతు తమ పశువులకు బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 80 పశువులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు, ఔత్సాహిక పాడిరైతులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

రూరల్ మండలం వెంకగనగరం పంచాయతీ పరిధిలోగల వెంకటాద్రి ఫంక్షన్ హాల్‌లో కాతేరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఈ శిబిరంలో గుండె వ్యాధులు, కిడ్నీకి సంబంధించిన, ఫలమనాలజీ, జనరల్ మెడిసిన్, నరములకు సంబంధించిన వ్యాధులకుగాను నగరంలో పలు ఆసుపత్రుల వైద్యులచే సుమారు 1000 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ సుగుణ, గీతా ముళ్ళపూడి, అకిరా కంటి ఆసుపత్రి వైద్యులు, సేవలందించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.

జాతీయ ఉపాధి హామీ పథకంలో రహదారులు డ్రైన్ పనులకు ప్రాధాన్యం

● సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 11: జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో సిమెంట్ రహదారులు, డ్రైయిన్స్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం డ్వామా పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతిపాదించే పనుల విషయంలో సమగ్ర నివేదిక సిద్ధం చేసుకుని మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఆయా పనులను చేపట్టాల్సి ఉంటుందన్నారు. సాంకేతిక అంశాలను కూడా పరిగణంలోకి తీసుకుని ప్రాజెక్టు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆయా పనులకు చెందిన పరిపాలన ఆమోదంతో మాత్రమే పనులు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటివరకు 966 పనులకుగాను రూ.89 కోట్ల 75లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయా పనుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పనులు చేపట్టామన్నారు. నాలుగు కోట్ల77లక్షలతో 36 పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇంకా మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో ప్రతిపాదించే పనుల్లో సిమ్మెంట్‌రోడ్డు, డ్రైనేజీ, అనుసం ధాన రహదారుల(లింక్) పనులను చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామసభల్లో నిర్ధారించిన పనులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఆర్.శ్రీరాములు నాయుడు, అర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకరరావు, అధికారులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకుంటాం

● నీట మునిగిన పంటను పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



అచ్యుతాపురత్రయం వద్ద ఏలేరు వరద కారణంగా నీట మునిగిన వరి పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి పెదపూడి సెప్టెంబరు 11 : ఏలేరు వర దలతో పెదపూడి మండలంలో పలు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను బుధవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఏలేరు కాలువకు వరదలు రావడంతో పెదపూడి మం డలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. పంట పొలాలను పరిశీలించిన ఎమ్మె ల్యే అక్కడి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏలేరు ముంపుపై గత ప్రభుత్వంలో ఎన్ని సార్లు అదికారు లకు మొరపెట్టినా పట్టించుకునే నాదుడు కరువయ్యా డన్నారు, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నీల్లు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఏలేరు సమీపంలో ఉన్న పలు కుటుంబాలను ఇప్పటికే సుర క్షిత ప్రాంతానికి తరలించామన్నారు. రైతులు అదైర్య పడవద్దని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

'ఉరుకు పటేల' చిత్ర యూనిట్ సందడి



ఐఎస్‌టీఎస్ కళాశాలలో సందడి చేస్తున్న సినీ నటులు

రాజానగరం, సెప్టెంబరు 11: రాజానగరం మండలం తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉరుకు పటేల సినీ బృందంసందడి చేశారు. విజయోత్సవ యాత్రలో భాగంగా బుధవారం కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్‌రెడ్డి చిత్ర బృందానికి పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా హీరో తేజస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 7న విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. ప్రేమ, హాస్యభరితంగా రూపుదిద్దుకున్న ఈసినిమా ప్రేక్షకులను అలరిస్తోందన్నారు. హీరోయిన్ కుష్బూ చౌదరి మాట్లాడుతూ తన తొలి సినిమా హిట్ కావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించాలి : ఎంపీడీవో

రంగంపేట, సెప్టెంబరు 11: బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించడానికి సమైక్యంగా కృషి చేయాలని రంగంపేట ఎంపీడీవో పి.వెంకటరత్నం సూచించారు.బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారులు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రాథమిక స్థాయిలో గాని, ఉన్నత స్థాయిలో గాని విద్యార్థులు బడి మానివేసినా, కళాశాల మానివేసిన వారిని గుర్తించి వారి విద్యాభ్యాసం కొనసాగేలా కృషి చేయాలన్నారు. వివాహం జరిగినా, గ్రామాంతరం వెళ్ళినా, అనివార్య కారణాల వల్ల మరణించినా, ఆ విద్యార్థులు బడికి వెళ్ళకపోవడానికి గల కారణాలను ఆ కుటుంబ సభ్యులను అడిగి వ్యక్తిగత వివరాలను సేకరించి నివేదిక తయారుచేసి ఈ నెల 19వ తేదీలోగా మండల విద్యాశాఖ అధికారులకు అందజేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,గ్రామ సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ,సిఆర్ఎంటిలు,తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

రాజమహేంద్రవరం కల్చరల్ సెప్టెంబర్ 11: తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటేనే, కుటుంబంతో పాటు దేశంకూడా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తాయని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 21వ వార్డు ఉల్లితోట వీధిలోని జన్ను మహంతి బంగారయ్య పాఠశాలలో మాజీ కార్పొరేటర్ నల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తల సమక్షంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి గర్భిణులను ఆశీర్వదించి, వారికి చీరలు పంపిణీ చేశారు.

విజయవాడ వరద బాధితులకు రూ. 3లక్షల విరాళం

కడియం సెప్టెంబరు 11 : విజయవాడ వరద బాధితులకు కడియం పల్లవెంకన్న చారిటబుల్ ట్రస్ట్ రూ.3లక్షలు విరాళం అందించింది. బుధవారం రాజమహేంద్రవరంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి నివాసంలో కడియం నర్సరీ మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, ఇండియన్ నర్సరీమెన్ మా జీ గవర్నింగ్ సభ్యులు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, జనసేన నాయకులు గట్టి సుబ్బారావు, నర్సరీ రైతులు బోరుసు సుబ్బారాయుడు, పుల్లా పెద సత్యనారాయణ, పల్ల వెంకటేష్, నక్కా అమ్మిరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పంతం గణపతిలు గోరంట్లను కలిసి రూ.3లక్షల విరాళం చెక్కును అందించారు. ఈసందర్భంగా పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను గోరంట్ల అభినందించారు.

మెన్స్, ఉమెన్స్ సింగిల్స్ బ్యాడ్మింటన్ విజేతలు కర్నాటక క్రీడాకారులు

● బాలికల సింగిల్స్ అండర్ - 19 విజేత ఏపీ

● ముగిసిన సౌత్‌జోన్ ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలు



సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో గెలుపొందిన విజేతలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11 : రాజమహేంద్రవరంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన 78వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో మెన్స్ సింగిల్స్ ఉమెన్స్ సింగిల్స్‌లో కర్నాటక క్రీడాకారులు విజేతులుగా నిలిచారు. మెన్స్ విభాగంలో కర్నాటకు చెందిన తుషార్ సువీర్ తమిళనాడుకు చెందిన కిషోర్.ఎస్‌పై 21-17, 21-17 స్కోర్లు తేడాతో గెలుపొందాడు. ఉమెన్స్ సింగిల్స్‌లో కర్నాటకకు చెందిన లీషా పాల్ తమిళనాడుకు చెందిన ఆదర్శిణి శ్రీని 16-21, 21-16, 21-13 స్కోర్లు తేడాతో గెలుపొందింది. బాలుర సింగిల్స్ అండర్ - 19 విభాగంలో కర్నాటకు చెందిన తుషార్ సువీర్ తమిళనాడుకు చెందిన సుజీ సాయి బాల సింపుపై 12-21, 21-13, 21-15 స్కోర్లు తేడాతో గెలుపొందాడు. బాలికల సింగిల్స్‌లో అండర్ -19 విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రవల్లిక మణి ఆమర్తి పాండిచ్చేరికి చెందిన జననికపై 21-16, 21-12 స్కోర్లు తేడాతో గెలిచింది. అలాగే, మెన్స్ డబుల్స్‌లో తమిళనాడుకు చెందిన హరిహరన్, రూబప్ కుమార్ జోడీ కర్నాటకకు చెందిన కిషాల్, రుద్రపై గెలుపొందారు. ఉమెన్స్ డబుల్స్ విభాగంలో కర్నాటకకు చెందిన దీపక్‌రాజ్, పొన్నమ్మ జోడీ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దీపిక, స్రవంతి జంటపై గెలుపొందారు. జూనియర్ మిక్స్‌డ్ డబుల్స్ అండర్ - 19 విభాగంలో తమిళనాడుకు చెందిన నిరంజన్, వర్ష జోడీ కర్నాటకు చెందిన ఆర్య, దీపక్‌రాజ్ జోడీపై విజయం సాధించారు.

● క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ...

సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విజేతలకు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్, జనసేన పార్టీ సిటీ ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బ్యాడ్మింటన్ కోచ్‌లు, క్రీడాకారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు రూ.3కోట్లు అందజేత

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాదితులను ఆదుకునేందుకు రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘాల సమాఖ్య రూ.3 కోట్లు అందించింది. ఈమేరకు విజయవాడలో రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజమహేంద్రవరానికి కూనపరెడ్డి ఎస్‌వీ రామారావు సీఎం సహాయ నిధికి ఈ చెక్కును అందించారు. కూనపరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లో 29600 రేషన్ షాపుల డీలర్లు ఒక్కొక్క షాపునకు రూ. వెయ్యి చొప్పున సీఎం సహాయ నిధికి రూ.3 కోట్లు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవివి గిరిజారావు, కార్యదర్శి శంకరరావు, ఉపాధ్యక్షుడు వి అంజయ్య, కార్యదర్శి ఎస్ నాగార్జున , కార్యవర్గ సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలని నిరసన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 11 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని కోరుతూ రాజమహేంద్రవరంలో దళిత సంఘాలు, మాల సంఘాలు, ఎస్సీ ఉద్యోగ సంఘాల నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఉదయం రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలతో నివాళులర్పించారు. అక్కడి నుంచి బయలు దేరి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, నక్కా వెంకటరత్నరాజు, జార్జి అంటోని, పట్నాల విజయకుమార్, ముళ్ళ మాదవ్, న్యాయవాది సాకా సురేష్ బాబు, కంబాలపేట బాబీ, కోనాల లాజర్, బిఎస్ఎన్ఎల్ సుబ్బారావు, సుందరపల్లి అనిల్, జి అనిల్ కుమార్, కే సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్‌లో 30 లాకర్స్ ప్రారంభం



లాకర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 11: రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో రుడా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 30 లాకర్స్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. బుధవారం పుష్కరాల రేవులో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పుష్కరాలరేవులో గోదావరి స్నానాలకు వచ్చే భక్తులు వారి సామాన్లు భద్రపరుచుకోవడానికి ఇక్కడ ఎటువంటి సౌకర్యం లేకపోవడంతో లాకర్స్ ఏర్పాటుచేశారు. గోదావరి వరద ఉధృతి తీవ్రంగా ఉందని రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారని అందువలన వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసుకున్న కమిటీలు గణపతి విగ్రహాల నిమజ్జనం మరొక రెండురోజులు పొడిగించుకోవాలని సూచించారు. పుష్కరాలరేవులో మహిళలు దుస్తులు మార్చుకునే గది చాలా అధ్వానంగా ఉందని దానిని ఆధునీకరించి అందుబాటులోకి తీసుకురావాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, నగరపాలక సంస్థ, రుడా అధికారులు పాల్గొన్నారు.

రూ.44 కోట్ల పనులకు ప్రతిపాదనలు

● రాజమహేంద్రవరంలో దెబ్బతిన్న పైప్‌లైన్లు పరిశీలించిన కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 11 : రాజమహేంద్రవరంలో దెబ్బతిన్న బీటీ రోడ్లు, మురుగునీటి పైప్‌లైన్లను నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. బుధవారం కమిషనర్ నగరంలో ఆర్యాపురం ఎస్ఆర్‌సీపీ నుంచి ఎస్‌టీపీకి వెళ్లే మురుగునీరు పైప్‌లైన్ లీకేజీలను పరిశీలించారు. ఇప్పటికే నగరంలో డ్రోన్ల సర్వే ద్వారా పరిస్థితిని పరిశీలించిన కమిషనర్ కేతన్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. నగరంలో వివిధ పనులకు సంబంధించి రూ.44 కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిచారు. ఈ నేపథ్యంలో అత్యవసర పనులను త్వరగా చేపట్టాలని, మరమ్మతులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట ఎస్ఈ పాండురంగారావు, ఈఈ, డీఈ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రుడా వైస్ చైర్మన్‌గా కమిషనర్ కేతన్ బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 11: రాష్ట్ర ప్రభుత్వ జీవో ఆర్ నెం 683 ప్రకారం రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం వీసీ బాధ్యతలు స్వీకరించారు. నగరపాలకసంస్థ కార్యాలయం ప్రాంగణంలో రుడా కార్యాలయానికి వెళ్ళిన ఆయన సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కేతన్‌గార్గ్ మాట్లాడుతూ రుడా వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయటానికి చర్యలు తీసుకుంటామన్నారు. పరిపాలన పారదర్శకంగా ఉండేలా చూస్తామన్నారు.

విరిగిన పడవ ఫ్యాన్ రెక్కలు

● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ఫ్యాన్ రెక్కలు విరిగిన మర పడవ

సీతానగరం, సెప్టెంబరు 11: గోదావరినది ఉధృతగా ప్రవహిస్తున్న సమయంలో బోట్లు లేకపోవడంతో చిన్న మరపడవపై కాకినాడ సమీపంలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ములకల్లంక చేరుకోవడానికి బొబ్బిల్లంకవైపు ఒక చిన్న మరపడవను ఆశ్రయించారు. ప్రస్తుతం ఇక్కడ అవే తిరుగుతున్నాయి. బోటు వచ్చినా ఇంకా ప్రారంభించకపోవడంతో చిన్న మరపడవపైనే ప్రయాణాలు జరుగుతున్నాయి. ఆ పడవపైనే యువకులు కూర్చున్నారు. ములకలంకకు బయలుదేరిన పడవకు కొద్దిదూరం వెళ్లేసరికి ఉన్న ఫ్యాన్ రెక్కలు విరిగిపోవడంతో పడవ అటుఇటు ఊగడం ప్రారంభించడంతో పడవను చాకచక్యంగా తిరిగి వెనుకకు తిప్పి ఒడ్డుకుచేర్చారు దీంతో యువకులు ఊపిరిపీల్చుకున్నారు. ఆ సమయానికి అధికారులుగాని ప్రభుత్వోగులుగాని లేరు. అందరూ ఒక్కసారిగా భోజనాలకు వెళ్లినట్లు తెలిసింది.

బీజేపీతోనే దేశాభివృద్ధి: ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, సెప్టెంబరు 11: భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. బిక్కవోలులో ఆయన బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సెల్‌ఫోన్ ద్వారా మిస్డ్‌కాల్ ఇప్పించి పార్టీ సభ్యత్వాన్ని కల్పించారు. ఈసందర్భంగా గ్రామంలోని వైసీపీకి చెందిన లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామమూర్తి, జంగం వీరాబాబు, బ్రతు వీర్రాజు, రాయి పెదఅప్పారావు, గుంటముక్కల వీరభద్రరావు తదితరులు 50 మంది పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు, మండల పరిశీలకురాలు హారిక, అధ్యక్షుడు పవన్‌కుమార్, లక్ష్మి, పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, రాయుడు రామచంద్రరావు, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా ఆయన గణపతి ఉత్సవాల్లో భాగంగా బిక్కవోలు లక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట ఉత్సవకమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి ఉన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక సందర్శన

రాజానగరం, సెప్టెంబరు 11 : రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరాన్ని సందర్శించారు. దీనిలో భాగంగా పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంపై ఆసుపత్రి వైద్యులు గట్టి రామభాస్కర్, వెంకటలక్ష్మి, ఉదయ ఏంజెల్‌ను డీఎంఅండ్‌హెచ్‌వో అభినందించారు. పీహెచ్‌సీలో పురుడు పోసుకున్న మహిళను పలకరించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎన్‌వి రమణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం, సెప్టెంబరు 11 : రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పలు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాజానగరం సీడీపీవో టి.నాగమణి తెలిపారు.ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలవరకు దరఖాస్తులను స్వీకరిస్తామని, అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాజానగరంలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.

బీఎస్ఎన్ఎల్ రోమింగ్ వైఫై ప్రారంభం

రాజమహేంద్రవరం కల్చరల్ సెప్టెంబర్ 11:భారత ప్రభుత్వ రంగా సంస్థ బీఎస్ఎన్ఎల్ రోమింగ్ వైఫై ప్రారంభించిందని బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు అన్నారు. ఇందులో రిజిస్టర్డ్ అయినవాళ్లు, ఎక్కడకు వెళ్లినా, బీఎస్ఎన్ఎల్ వైఫైతో కనెక్ట్ కావచ్చని ఆయన తెలిపారు. జిల్లాలో వైఫై రోమింగ్ ప్రారంభించిన సందర్భంగా స్థానిక గోకవరం బస్టాండ్‌లోని నన్నయ సంచార్‌భవన్‌లో బుధవారం బిజినెస్ డెవలప్‌మెంట్, విస్తరణ అంశాలకు సంబంధించి ఆయన సమావేశం నిర్వహించారు. డీజీఎంలు నాగరాజు, సత్యనారాయణ, మార్కెటింగ్ ఎస్డీఈ కృష్ణారావు, ఏజీఎంలు శారదాదేవి,శైలజ, జయశ్రీ, పీఆర్వో వాసు, ఇంకా పలువురు అధికారులు, డీస్‌ఏలు పాల్గొన్నారు. ఈ సందర్భగా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు మాట్లాడుతూ ఇప్పటికే కనెక్షన్లు ఉన్నవారు, రోమింగ్ వైఫైలో రిజిస్టర్ కావాలని, దేశంలో ఎక్కడైనా బీఎస్ఎన్ఎల్ వైఫైతో కనెక్ట్ అయ్యే అవకాశం పొందాలని కోరారు. ఇలా వినియోగించుకోవడంవల్ల నెట్‌చార్జీలు వినియోగించుకున్నవారి కనెక్షన్లకే పడతాయని, అందుచేత ఎవరూ అభ్యంతరం చెప్పబోరని అన్నారు. ప్రస్తుతం 98,957 కనెక్షన్లు ఉన్నాయని, కొత్తగా కనెక్షన్లు తీసుకొనేవారికి, రోమింగ్ వైఫైలో రిజిస్టర్ అయ్యేలా చూస్తామని అన్నారు. గ్రామాల్లో ప్రతి 500 మీటర్లకు ఒక హాట్‌స్పాట్ కూడా పెట్టాలని భావిస్తున్నట్లు చెప్పారు. కస్టమర్ సర్వీస్ సెంటర్స్‌కు, మేళాలకు విచ్చేసి, తమ 2జి,3జి,4జి సిమ్ కార్డులను తప్పనిసరిగా మార్చుకోవాలని చేసిన విజ్ఞప్తికి మంచి స్పందన లభించిందన్నారు.

సీసీ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు : ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 11: అనపర్తి నియోజక వర్గంలోని నాలుగు మండలాలకు సీసీ రోడ్ల నిర్మాణా నికి రూ.14.05కోట్లు నిదులు మంజూరైనట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం అనపర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలాల వారీగా మంజూరైన నిధుల వివరాలను ఆయన వివరించారు. అనపర్తి మండలానికి రూ.3.42 కోట్లు, రంగంపేట రూ.3.64కోట్లు, బిక్కవోలు రూ.3.50 కోట్లు, పెదపూడి రూ.3.49కోట్లు నిదులు మంజూరైన ట్లు ఆయన తెలిపారు. ఎన్ఆర్‌ఈజీఎస్ నుంచి ఈ నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు.


పెద్దాపురం మండలం దివిలిలో చంద్రబాబు అభివాదం

అండగా ఉంటా.. ఆదుకుంటా!


రాజుపాలెంలో చంద్రబాబుతో మాట్లాడుతున్న ముంపు బాధిత మహిళ

- ఏలేరు వరద బాధితుల్లో ధైర్యం నింపిన సీఎం చంద్రబాబు
- బాధితులందరినీ అన్ని విధాలా ఆదుకుంటామని ప్రకటన
- రాజుపాలెం గ్రామానికి ఎక్స్‌కవేటర్‌పై వెళ్లి పలకరించిన సీఎం
- ముంపులో చిక్కుకున్న పెంకుటిళ్లు లోపలకు వెళ్లి బాధితులకు భరోసా
- ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు, దుస్తులు ఇవ్వనున్నట్టు వెల్లడి
- కుళ్లిన వరి కంకులను చంద్రబాబుకు చూపించి రైతుల ఆవేదన
- ఏలేరు ఆధునికీకరణ పూర్తి చేసే బాధ్యత ఎన్డీయేదేనని ప్రకటన
- వడ్లమూరులో రైతు ఇచ్చిన కొబ్బరి బొండం తాగిన చంద్రబాబు
- దివిలి వద్ద విద్యార్థులతో మాటామంతీ.. రాజుపాలెం వద్ద రైతులతో..
- సామర్లకోటలో దిగి.. అక్కడ నుంచి వెళ్లి ఏలేరు కాలువ పరిశీలన



కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో ముంపు ప్రాంతాలను ఎక్స్‌కవేటర్‌లో వెళ్లి పరిశీలిస్తున్న చంద్రబాబు.. నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం


రాజుపాలెంలో ఏలేరు కాలువను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



పెద్దాపురం మండలం వడ్లమూరులో ఏలేరు కాలువ పరిశీలిస్తున్న చంద్రబాబు.. వరదకు దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న సీఎం

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/పెద్దాపురం/కిర్లంపూడి/సామర్లకోట, సెప్టెంబరు11: 'ఏలేరు వరద బాధితులకు అండగా ఉంటా. ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలి. ప్రతి వరద బాధిత కుటుంబానికి రూ.10వేలు సాయం చేస్తా.తక్షణం దుస్తులు పంపిణీ చేయిస్తా. పంటలు నష్టపోయిన అన్నదాతలకు హెక్టారుకు రూ.25వేల సాయం, ఎరువులు, పొటాషియం అందిస్తా. ఇళ్లు దెబ్బతిన్న వారికి ఇళ్లు కట్టిస్తాను' అని సీఎం చంద్రబాబు ధైర్యం చెప్పారు. ప్రతిఒక్కరికీ సాధ్యమైనంత వేగంగా సాయం పంపిణీ చేయిస్తామని వివరించారు. ఏలేరు వరద బాధిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు బుధవారం పర్యటించారు. మధ్యాహ్నం 1.53 గంటలకు సామర్లకోట జూనియర్ కాలేజీ మైదానంలో హెలీకాప్టర్‌లో దిగారు. అక్కడ నేతలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం నేరుగా కిర్లంపూడి మండలం రాజుపాలెం వరద ముంపు గ్రామం పరిశీలనకు వెళ్లారు. మార్గమధ్యలో బస్సు దిగి పెద్దాపురం మండలం వడ్లమూరు బ్రిడ్జిపై నుంచి ఏలేరు వరదను పరిశీలించారు. వరద తమ పొలాలను ఏవిధంగా ముంచేసిందో కొందరు రైతులు చంద్రబాబుకు వివరించారు. అనంతరం దివిలి సెంటర్‌లో బీఎస్సార్ కాలేజీ విద్యార్థులు సీఎం కోసం వేచి చూడగా వీరిని చూసి సీఎం బస్సు దిగారు. వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులు రూ.లక్ష చెక్కును ఏలేరు వరద బాధితుల సహాయం కోసం అందించారు. అక్కడి నుంచి సీఎం రాజుపాలెం గ్రామానికి చేరుకున్నారు. అప్పటికీ గ్రామంలో ఛాతివరకు వరద నీరు ప్రవహిస్తోంది. ఏలేరుకు గండిపడడంతో పూర్తిగా వరద ముంపులో చిక్కుకున్న గ్రామానికి సీఎం సాహసం చేసి ఎక్స్‌కవేటర్‌పైకి ఎక్కారు. పక్కనే ఏలేరు వరద ఉధృతి కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఎన్ని ఎకరాల మేర పంటలు మునిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వరద ముంపులో చిక్కుకున్న ఇళ్ల వద్దకు మోకాల్లోతు నీటిలోకి దిగి వెళ్లారు. తొలుత కాకాడ వసంతరావు ఇంటికి వెళ్లారు. ముంపుతో ఏ విధంగా నష్టపోయామో బాధితులు సీఎంకు వివరించగా పక్కనే ఉన్న కలెక్టర్‌ను పిలిచి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత వినకోటి కోటేశ్వరరావు, గణేశుల బాబురావు, చక్రవర్తుల సత్యన్నాయరణమ్మ, కేలంగి వెంకటలక్ష్మి, స్థానిక ఎస్సీ పేటకు చెందిన వికలాంగుడు దెయ్యాల నాగు తదితర కుటుంబాలతో చంద్రబాబు మాట్లాడారు. వరదకు ఇళ్లు ముంపుతో నష్టపోయిన తీరును చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. భూపాలపట్నంలో ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతిచెందడంతో ఆ విషయం తెలుసుకున్న చంద్రబాబు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి సీఎం రాజుపాలెం పంచాయతీకి చేరుకుని బాధితులకు నిత్యావసర సరుకులు అందించారు. కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లోని వరద ముంపు ప్రాంతాలను సందర్శించిన అనంతరం సీఎం చంద్రబాబు సామర్లకోట చేరుకుని జిల్లా ఉన్నతాధికారులతోను, ప్రజాప్రతినిధులతోను సమీక్షిస్తారని ముందుగా అధికారులు ప్రకటించారు. అందుకు అనుగుణంగా బుధవారం మధ్యాహ్నం సామర్లకోట టీటీడీసీ ఆవరణలో వరద ప్రాంతాల ఛాయా చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో బాధిత రైతులతో మమేకమైన సీఎం అక్కడ అధిక సమయం ఉండడంతో అప్పటికప్పుడు సామర్లకోటలోని కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీ సత్యనారాయణమూర్తిలు హెలీపాడ్ వద్దకు సీఎంకు వీడ్కోలు పలికేందుకు తరలివెళ్లారు.

ఏలేరు ఆధునికీకరణ బాధ్యత ఎన్డీయేదే..

ఏలేరు కాలువ ఆధునికీకరణ బాధ్యత పూర్తి బాధ్యత ఎన్డీయేదే అని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు కష్టాలు వచ్చాయన్నారు. ఏలేరు రిజర్వాయర్‌కు ఒకేసారి 47వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చిందని, కిందకు వదలకపోతే ప్రాజెక్టుకు ప్రమాదం కావడంతో వరద వదలారన్నారు. దీంతో పలు ప్రాంతాలు నీట మునిగాయన్నారు. వరదల కారణంగా జిల్లాలో 65 వేల ఎకరాలు పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. ఏలేరు వరదపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారన్నారు. వరద ఏలేరు కాలువల్లో ఎలా ప్రవహిస్తోంది. గండ్లు ఎక్కడ పడే అవకాశం ఉందనే దానిపై అధికారులు డ్రోన్ల ద్వారా చూసి కలెక్టర్ సమయస్ఫూర్తితో వ్యవహరించారన్నారు. కాగా సీఎం ప్రయాణించిన బస్సులో ఎమ్మెల్యేలు ఎక్కారు. కిర్లంపూడిలో వరద ప్రభావం గురించి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చంద్రబాబుకు వివరించారు. ఏలేరు రిజర్వాయరుకు వస్తోన్న ఇన్‌ఫ్లో, కాలువలకు గండ్ల పరిస్థితిని ఎమ్మెల్యే సత్యప్రభ వివరించారు. పిఠాపురం మునిగిన తీరును ఫొటోలతో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ చంద్రబాబుకు వివరించారు. బాబు వెంట ఎమ్మెల్యేలు యనమల దివ్య, పంతం నానాజీ, దాట్ల బుచ్చిరాజు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, చిక్కాల రామచంద్ర రావు, జ్యోతుల నవీన్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు ఉన్నారు.


కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

కన్నీళ్ల.. తాడిమళ్ల!

జీడిమామిడి పిక్కల కింద చితికిన కూలి బతుకులు.. మొత్తం ఏడుగురిని మింగేసిన చిన్నాయిగూడెం వ్యాను ప్రమాదం.. నలుగురు సురక్షితం

నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామం కన్నీళ్లతో నిండిపోయింది. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు జీడి మామిడి పిక్కల బస్తాల కింద చితికిపోయాయి. జట్టు కూలీలు 'జట్టు'గానే విగతజీవులయ్యారు. నిద్ర కోసం మూసిన కన్ను మూసినట్టుగానే ఊపిరి ఆగిపోయింది. అర్ధరాత్రి వేళ ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు.. ఒకే వీధికి చెందిన ముగ్గురు.. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు.. మరో ఊరికి చెందిన ఒకరిని వ్యాను ప్రమాదం రోడ్డు మింగేసింది. పన్నుల ఎగవేతకు యజమాని అడ్డదారిలో వెళ్లడం ఏడు కుటుంబాలను రోడ్డున పడేసింది.




వ్యాన్ బోల్తా ప్రమాదంలో మృతి చెందిన వారు వరుసగా.. తాడి కృష్ణ, తమ్మిరెడ్డి సత్యనారాయణ.. పెనుగుర్తి చిన ముసలయ్య.. దేశాల వీర వెంకట సత్యనారాయణ (బూరయ్య).. కత్తవ నారాయుడు.. కత్తవ కృష్ణ.. బొక్కా ప్రసాద్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తాడిమళ్లలో సుమారు 100 వరకూ జీడిపిక్కల ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ గ్రామంతోపాటు చుట్టుపక్కల వాళ్లకు ఇదే ప్రధాన జీవనాధారం. మహిళలు కూడా ఇంటివద్ద జీడిపప్పును వలుస్తూ పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతుంటారు. ఫ్యాక్టరీలకు అవసరమైన జీడిమామిడి పిక్కలను వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి తరలిస్తారు. జీడిపిక్కలను బస్తాల్లో పట్టడం, ఎగుమతి, దిగుమతికి జట్టు కూలీలు అవసరం. దీంతో తాడిమళ్ల చుట్టు పక్కల ప్రాంతాల్లోని మగవాళ్లు ఈ పనులకు వెళ్తారు. పైగా ఈమధ్య వర్షాల వల్ల వ్యవసాయ పనులు లేకపోవడంతో జీడిపిక్కల పనులపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ క్రమంలో కత్తవ కృష్ణ (మేస్త్రి-40) ఆధ్వర్యంలో కత్తవ నారాయుడు(45), తాడి రామకృష్ణ (45), తమ్మిరెడ్డి సత్యనారాయణ (44), దేశాల వీర వెంకటరావు (బూరయ్య-40), బొక్కా ప్రసాద్ (35), పెనుగుర్తి చినముసలయ్య (35) జట్టుగా మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో డీసీఎం వ్యానులో బయలుదేరి ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలంలోని బొర్రంపాలెం వెళ్లారు. జీడిపిక్కలను బస్తాల్లోకి ఎత్తి ఎగుమతి చేసుకొని అక్కడి నుంచి రాత్రి బయలుదేరారు. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం దగ్గరలోని చిలకవారిపాకలు(పట్టాభిపురం) వద్ద 11.30 గంటల సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. సాధారణంగా జట్టు కూలీలు లోడుపైనే నిద్రిస్తారు. మృత్యువాత పడిన ఏడుగురు, ప్రాణాలతో బయటపడిన గంటా మధు జీడిపిక్కల లోడుపై పడుకున్నారు. క్యాబినులో మరో జట్టు కూలీ లోయ ఇమ్మానుయెల్‌రాజు, డ్రైవరు మాపటి శివాజీ కుమార్, క్లీనరు గంటి కిషోర్‌కుమార్ ఉన్నారు. వ్యాను కుదుపుల్లో జీడిపిక్కల బస్తాలపై నుంచి నిద్రిస్తున్న సమయంలో కింద పడిపోకుండా లోడుపైన ఓ రెండు వరుసలు జీడిపిక్కల బస్తాలను డొప్పలా వేసి మధ్యలో కూలీలు పడుకుంటారు. ఇదే స్థలంలో ఈ ఎనిమిది మంది నిద్రించారు. వ్యాను తాడిమళ్లకు సుమారు 15 కిలోమీటర్ల దూరంగా ఉండగా చిలకవారిపాకల వద్ద మలుపు తిరిగింది. కొద్ది దూరంలో కుడి వైపున గొయ్యి ఉండడంతో వ్యానును డ్రైవరు కాస్త ఎడమవైపునకు తిప్పాడు. రోడ్డు పక్కన కేవలం అరడుగు వెడల్పుతో గ్రావెల్ బెర్మ్ ఉంది. వర్షాలు అది లూజుగా తయారైంది. దీంతో వ్యాను టైర్లు ఈ బెర్మ్‌పైకి ఎక్కగానే జారిపోయింది. తుప్పలతో నిండిపోయి చిన్న లోయలోకి పూర్తిగా బోల్తా పడింది. దీంతో లోడుపై పడుకున్న వాళ్లు 15 టన్నుల లోడు బస్తాల కింద నలిగిపోయారు. ఈ వ్యానుకు ముందు వెళుతున్న వీళ్లకు చెందిన వ్యానులో ఫ్యాక్టరీ యజమాని మనిషి నక్కాకుల నాగబాబు మరో నలుగురు జట్టు కూలీలు ఉన్నారు. ప్రమాదానికి గురైన వ్యాను క్యాబిన్‌లోని ఇమ్మాన్యుయేల్, డ్రైవరు, క్లీనరు బయటకురాగా.. డ్రైవరు, క్లీనరు భయంతో పారిపోయారు. ఇమ్మాన్యుయేల్ ముందు వెళ్లిన వ్యానులోకి వారికి ఫోన్‌చేశాడు. దీంతో వాళ్లు, స్థానికులు వచ్చి బస్తాలు తీయడానికి శ్రమించారు. సుమారు 2 గంటలపాటు ప్రయత్నించి 8 మందినీ బయటకు తీశారు. ఈలోపు ఊపిరాడక ఏడుగురు దుర్మరణం చెందారు. లోడుపై పడుకున్న ఎనిమిది మందిలో గంటా మధు ప్రాణాలతో బయటపడ్డాడు. మృతుల్లో ఆరుగురిది నిడదవోలు మండలం తాడిమళ్లకాగా, బొక్కా ప్రసాద్(40)ది మండలంలోని ఉనకరమిల్లి గ్రామం. ఈ ప్రమాదంలో మృతి చెందినవారు అతిపేదవాళ్లు. మగవాళ్లు జీడిపిక్కలు, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుండగా.. ఆడవాళ్లు కొందరు జీడిపిక్క ఒలుపు చేస్తుంటారు. ఇందులో కత్తవ కృష్ణ, కత్తవ నారాయుడు వరుసకు సోదరులు, ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో ఉంటున్నారు. వీరు దేశాల వీర వెంకట్రావు ఒకే వీధిలో ఉంటారు. అలాగే.. మృతుల్లో బొక్కా ప్రసాద్‌ది ఉనకరమిల్లి కాగా డ్రైవరు, క్లీనరుతోసహా అందరిదీ తాడిమళ్లే.

● అడ్డదారులు రోడ్డున పడేశాయి

జీఎస్టీ, మార్కెట్ తదితర పన్నులు, టోల్‌ఫీజుల నుంచి తప్పించుకోడానికి అడ్డదారుల్లో సరుకును రవాణా చేయడం ఈ ప్రాంతంలో పరిపాటిగా మారిపోయింది. ఏడు కుటుంబాలు రోడ్డున పడితేగానీ ఈ తతంగం అధికారులకు కనిపించలేదు. వాస్తవానికి హెవీ లోడ్ వాహనాలు తిరగడానికి పనిచేయని మార్గాల్లో జీడిపిక్కలను రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. ఇప్పుడు ప్రమాదానికి గురైన వ్యాను జంగారెడ్డిగూడెం నుంచి హైవేలో తాడిమళ్ల చేరుకోవచ్చు. కానీ సింగిల్ రోడ్ల వెంబడి ప్రయాణించింది. గురవయ్యగూడెం, లక్కవరం కట్ట, పోతవరం, చిన్నాయగూడెం, యర్నగూడెం మీదుగా తాడిమళ్ల వెళుతోంది. ప్రమాదానికి గురైన వ్యాను చిమ్మచీకటిలో సింగిల్ రోడ్డులో వెళుతుండగా కుడివైపున గొయ్యిని తప్పించబోయి ప్రమాదానికి గురైనట్టు తెలుస్తోంది. నేషనల్ లారీలపై దూర ప్రాంతాలకు తిరిగిన అనుభవం డ్రైవరుకు ఉందని చెబుతున్నారు. దీంతో అడ్డదారే కొంపముంచిందని తెలుస్తోంది.

● ఎలా జరిగిందంటే.. మృత్యుంజయుడు మధు


జీజీహెచ్‌లో గంటా మధు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11: జీడిపిక్కల లోడు కోసం మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో తాడిమళ్ల నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లాం. అక్కడి రైతుల దగ్గర కొన్న జీడిపిక్కలను లోడు చేసుకుని తాడిమళ్లకు రాత్రి 8.30, 9 గంటల సమయంలో బయలుదేరాం. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో మా వాహనం బోల్తాపడింది. చుట్టూ చీకటి. అసలు ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలియలేదు. అతికష్టం మీద ప్రాణాలతో బయటపడ్డాను అని ఈ దుర్ఘటనలో మృత్యుంజయుడిగా నిలిచిన తాడిమళ్లకు చెందిన గంటా మధు అన్నారు. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం శివార్లలో జరిగిన దుర్ఘటనలో కవుకు దెబ్బలుతిని, ప్రాణాలతో బయటపడిన మధును గోపాలపురం ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మధు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మేమంతా తాడిమళ్ల నుంచి 11 మందిమి జీడిపిక్కల లోడు కోసం వెళ్లాం. తిరిగి వచ్చేటప్పుడు ఇద్దరు కేబిన్‌లోకి ఎక్కారు. మిగిలిన వాళ్లం మేం పైకి ఎక్కాం. మేం ఎక్కిన వ్యాన్ ఒక్కసారిగా తిరగబడిపోయింది. చాలాసేపటి తర్వాత మా ఊరు వాళ్లు, చుట్టుపక్కల గ్రామాలవాళ్లు వచ్చారు. అప్పటికే జీడిపిక్కల బస్తాలు మీద పడిపోయాయి. ఊపిరాడలేదు. ఆ చీకట్లో హాహాకారాలు తప్ప ఎవరు ఎక్కడ పడ్డారో తెలియలేదు. వ్యాన్ నెమ్మదిగా ఆగుతుండడంతో మా ఊరు వచ్చేసింది అనుకున్నా. ఈలోపే కింద పడిపోయాను. నాపై పిక్కల బస్తాలు పడ్డాయి. నడుము, కాళ్లపైన బస్తాలు పడ్డాయి. మీదపడిన జీడిపిక్కల బస్తాలను చేతులతో ఆపుకుంటూ కిందున్న మట్టిని చేతులతో ఖాళీ చేసుకుంటూ నెమ్మదిగా బయటకు వచ్చానని పేర్కొన్నాడు.



చిన్నాయిగూడెం వద్ద వ్యాన్ ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలు.. ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్



క్యాబిన్‌లో అలవాటు : లోయ ఇమ్మాన్యేల్ రాజు, ప్రమాదంలో బయటపడిన యువకుడు

మాది కూడా తాడిమళ్ల. అందరం జట్టు కూలీలుగా పని చేస్తాం. ఈ మధ్య వ్యవసాయ పనులు లేకపోవడంతో వీటికే వెళ్తున్నాం. నాకు క్యాబిన్‌లో పడుకుంటే నిద్రపడుతుంది. అందువల్ల క్యాబిన్‌లో ఎక్కాను. ప్రమాదం జరిగినప్పుడు పడుకొని ఉన్నాను. వ్యాన్ తిరగబడ్డాక క్యాబిన్ పైకి వచ్చి ఫోన్లు చేశాను. ఈలోపు అందరూ వచ్చారు. సుమారు 2 గంటలు కష్టపడి అందర్నీ బయటకు తీశాం.


మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న దుర్గేష్


మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న శేషారావు

ప్రభుత్వ సాయం రూ.5 లక్షలు

కొవ్వూరు/నిడదవోలు, సెప్టెంబరు 11: వ్యాన్ ప్రమా దంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయంగా ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. దీన్ని వెంటనే చెక్కుల రూపంలో మంత్రి కందుల దుర్గేష్ మృతుల కుటుంబాల ఇళ్లకు వెళ్లి బుధవారం సాయంత్రం అందజేశారు. అలాగే తన వంతు సాయంగా మరో రూ.25 వేలను అందించగా, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు రూ.20 వేల చొప్పున అందజేశారు. జీడిగింజల ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా ఒక్కొక్కరికీ రూ. 3లక్షల వంతున మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించింది. అలాగే వాహన ఇన్సూరెన్సు కంపెనీ నుంచి, ఇన్సూరెన్సు, కార్మిక సంక్షేమ బోర్డు నుంచిగాని ఇంకా ఇతర బెనిఫిట్స్ ఏమున్నా అందించి ఆదుకోవడం జరుగుతుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజులు వెల్లడించారు. కాగా ఈ ఘటనపై ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

జిల్లాలో బ్యాంకు లింకేజీగా 4899 గ్రూపులకు రూ.439.50 కోట్లు మంజూరు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు11: జిల్లాలో స్వయం సహాయక సంఘాలలోని 4899 గ్రూపులకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.439.50 కోట్ల బ్యాంకు లింకేజీ మంజూరు చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఆర్‌డిఏ, మత్స్యశాఖ, ఉద్యానవనశాఖ, పారిశ్రామికశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీనిధి పథకం ద్వారా ఇప్పటివరకు 13,695 స్వయం సహాయక సంఘాలకు రూ 77.18 కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. మహిళామార్ట్‌ల ద్వారా లక్ష్యం మేరకు అమ్మకాలు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక పెట్టుబడి నిధులు నూరుశాతం వసూలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చెందే దిశగా నూతనంగా యూనిట్ల ఏర్పాటు లోన్ల మంజూరు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలకు జీవనోపాధి కలిగించి అభివృద్ధిపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, డీపీఎంలు ఏ గణేష్, వై జనార్దనరావు ఎస్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

14న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాక

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11 : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈనెల 14న రాజమహేంద్రవరం రానున్నారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌ను ఆనుకుని నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనాలు, హాస్టల్ భవనాల పనులను ఆయన పరిశీలిస్తారు. అధికారులతోను ఆయన సమీక్షించే అవకాశం ఉంది. ఈమేరకు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఒక సర్క్యులర్ జారీ చేస్తూ, అందరు హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ, పారామెడికల్ అండ్ సపోర్టింగ్ స్టాఫ్ అంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వార్డులు, క్లినికల్ ఏరియాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

మెన్స్, ఉమెన్స్ సింగిల్స్ బ్యాడ్మింటన్ విజేతలు కర్నాటక క్రీడాకారులు

● బాలికల సింగిల్స్ అండర్ - 19 విజేత ఏపీ

● ముగిసిన సౌత్‌జోన్ ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలు



సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో గెలుపొందిన విజేతలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11 : రాజమహేంద్రవరంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన 78వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో మెన్స్ సింగిల్స్, ఉమెన్స్ సింగిల్స్‌లో కర్నాటక క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. మెన్స్ విభాగంలో కర్నాటకు చెందిన తుషార్ సువీర్ తమిళనాడుకు చెందిన కిషోర్.ఎస్‌పై 21-17, 21-17 స్కోర్లు తేడాతో గెలుపొందాడు. ఉమెన్స్ సింగిల్స్‌లో కర్నాటకకు చెందిన లీషా పాల్ తమిళనాడుకు చెందిన ఆదర్శిణి శ్రీని 16-21, 21-16, 21-13 స్కోర్లు తేడాతో గెలుపొందింది. బాలుర సింగిల్స్ అండర్ - 19 విభాగంలో కర్నాటకు చెందిన తుషార్ సువీర్ తమిళనాడుకు చెందిన సుజీ సాయి బాల సింహపై 12-21, 21-13, 21-15 స్కోర్లు తేడాతో గెలుపొందాడు. బాలికల సింగిల్స్‌లో అండర్ -19 విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రవల్లిక మణి ఆమర్తి పాండిచ్చేరికి చెందిన జననికపై 21-16, 21-12 స్కోర్లు తేడాతో గెలిచింది. అలాగే, మెన్స్ డబుల్స్‌లో తమిళనాడుకు చెందిన హరిహరన్, రూబప్ కుమార్ జోడీ కర్నాటకకు చెందిన కిషాల్, రుద్రపై గెలుపొందారు. ఉమెన్స్ డబుల్స్ విభాగంలో కర్నాటకకు చెందిన దీపక్‌రాజ్, పొన్నమ్మ జోడీ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దీపిక, స్రవంతి జంటపై గెలుపొందారు. జూనియర్ మిక్స్‌డ్ డబుల్స్ అండర్ - 19 విభాగంలో తమిళనాడుకు చెందిన నిరంజన్, వర్ధ జోడీ కర్నాటకు చెందిన ఆర్య, దీపక్‌రాజ్ జోడీపై విజయం సాధించారు.

● **క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ...**

సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విజేతలకు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్, జనసేన పార్టీ సిటీ ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బ్యాడ్మింటన్ కోచ్‌లు, క్రీడాకారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విలేఖరి అరెస్ట్

నల్లజర్ల, సెప్టెంబరు 11 : వరద బాధితులకు వెళ్లే నిత్యావసర సరుకుల లారీని అడ్డగించి డబ్బులు డిమాండ్ చేసిన నకిలీ విలేఖరిని అరెస్ట్ చేసిన సంఘటన నల్లజర్లలో జరిగింది. నల్లజర్ల సీఐ ఎస్.శ్రీనివాస్ వివరాల ప్రకారం పిఠాపురం గ్రామంలోని వరద బాధితులకు (ఉల్లిపాయలు, నూనె, బంగాళాదుంపలు)అందించేందుకు అమలాపురం డివిజన్ లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వెంకటప్రసాద్ విజయవాడ గొల్లపూడి ఎంఎల్‌యస్ పాయింట్ నుంచి 1లారీల్లో పిఠాపురం తీసుకుని వెళుతుండగా దెందులూరు గ్రామానికి చెందిన గుంపుల విక్టర్, మరో ఇద్దరు నకిలీ విలేఖర్లు బైక్‌పై వచ్చి తాము ఏలూరులోని వన్ టీవీ స్టాఫ్ రిపోర్టర్ అని చెప్పి సరుకును ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకుని వెళుతున్నారు. వాటి బిల్లులు చూపించాలని దురుసుగా ప్రవర్తించడంతో లారీ డ్రైవర్ ఇన్‌స్పెక్టర్ వెంకటప్రసాద్‌కు చెప్పడంతో ఆయన వచ్చి పిఠాపురం వరద బాధితులకు తీసుకుని వెళుతున్నామని చెప్పిన డబ్బులు డిమాండ్ చేయడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెళ్లి గుంపుల విక్టర్‌ను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పారిపోయినట్లు సమాచారం.

రోడ్డుపై వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

రోడ్డుపై వాహనాలను ఆపి డబ్బులు వసూళు చేస్తున్న ముఠాపై నిఘా పెట్టినట్లు సీఐ శ్రీనివాస్ చెప్పారు. రోడ్లపై వాహనాలను ఆపి డబ్బులు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

18 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

పెరవలి, సెప్టెంబరు11 : మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలకు సంబంధించి ఈనెల 18, 19, 20 తేదీలలో మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నూర్జహాన్ తెలిపారు. ఈఆటల పోటీలు సందర్భంగా పెరవలి ఎంఈవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో మొదటి రోజు అథ్లెటిక్స్, 2, 3 రోజుల్లో వివిధ రకాల గేమ్స్ జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలను ఖండవల్లి హైస్కూలులో మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పుల్లపరాజు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పుల్లపరాజు ఎస్‌డీఎస్ జేమ్స్, సుదాకర్, గంగాధరరావు, ప్రసాద్, రమేష్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఒక్కొక్కరికి రూ. 25లక్షలు ఇవ్వాలి

కొవ్వూరు, సెప్టెంబర్ 11 : దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామశివారులో జీడిపిక్కల డీసీఎం వ్యాన్ బోల్తాపడి మరణించిన ఏడు కుటంబాలకు, కుటుంబానికి రూ. 25 లక్షలు చొప్పున నష్ట పరిహారం జీడిపిక్కల ఫ్యాక్టరీ యాజమాన్యాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. బుధవారం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబాలకు అండగా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు జువ్వల రాంబాబు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను వెనక్కి తీసుకురావాలి

కొవ్వూరు, సెప్టెంబర్ 11 : విజయవాడ వరదముంపు ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టడానికి తీసుకువెళ్లిన కొవ్వూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులను రిలీవ్‌చేసి కొవ్వూరు తీసుకురావాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం కొవ్వూరు మున్సిపల్ మేనేజర్ జి. రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సంఘం గౌరవాధ్యక్షులు ఎం. సుందరబాబు మాట్లాడుతూ విజయవాడ వరద ముంపు ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టడానికి తీసుకువెళ్లిన 30 మంది కార్మికులను 4 రోజులు అని చెప్పి తీసుకువెళ్లి అనారోగ్యాలపాలు చేస్తున్నారన్నారు. నేటికి 9 రోజులు అయిన వారిని రిలీవ్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కొంత మంది అనారోగ్యం పాలై ఇంటికి వెళ్తామన్నా పంపించకుండా నిర్బంధంగా పని చేయిండాన్ని తీవ్రంగా ఖండించారు.

విజయవాడ వరద బాధితులకు విరాళం అందజేత

దేవరపల్లి, సెప్టెంబరు 11: దేవరపల్లి మండలం నుంచి విజయవాడ వరద బాధితులకోసం రూ.10లక్షల 50వేలు నగదును ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనిల్, మండలంలోని టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనిల్ మాట్లాడుతూ విజయవాడ బాధితు ల కోసం దేవరపల్లి మండలం నుంచి రూ.2లక్షలు, దుద్దుకూరు రూ.లక్ష, పల్లంట్ల రూ.లక్షా 20వేలు, లక్ష్మీపురం రూ.55వేలు, యాదవోలు రూ.25వేలు, యర్నగూడెం రూ.లక్ష, చిన్నాయిగూడెం రూ.లక్షా 25వేలు, ఝాన్సీనగరం రూ.60వేలు, గౌరీపట్నం రూ.లక్షా 60వేలు, త్యాజంపూడి రూ.50వేలు, కృష్ణంపాలెం రూ.28వేలు, కురుకూరు రూ.30వేలు వసూలు చేసిన విరాళాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

వినాయక నిమజ్జనంలో గల్లంతయిన

యువకుడి మృతదేహం లభ్యం



నిడదవోలు, సెప్టెంబరు 11 : నిడదవోలు మండలం బసివిరెడ్డిపేట వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో మంగళవారం సాయంత్రం వినాయక నిమ జ్జనం సమయంలో చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన పేరాడ రాజేష్ (20) గల్లంతయ్యాడు. బుధవారం అదే కాలువలో సమీపంలోనే రాజేష్ మృతదేహం లభ్యమైంది. నిమజ్జన ప్రాంతంలో బురదలో కూరుకుపో వడంతో పైకి రాలేక మృతి చెందాడని నీరు లాగడంతో బుధవారం మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై పట్టణ ఎస్ఐ పసుపులేటి శోభన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలువలో పడిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

దేవరపల్లి, సెప్టెంబరు 11: దేవరపల్లి మండలం కృష్ణంపాలెం గ్రామానికి చెందిన చిగురుపాటి శాంతారావు దేవరపల్లి పొగాకుబోర్డులో అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దేవరపల్లి నుంచి సాయంత్రం అత్తవారి ఇంటికి వెళ్తుండగా గండి చెరువువద్ద కాల్వలోపడిపోవడంతో పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా బుధవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉన్నారు.

అంతులేని వేదన.. ఆక్రందనల రోదన





ప్రభుత్వాసుపత్రివద్ద ఆందోళన చేస్తున్న బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు, ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి

● వ్యాన్ బోల్తా ఘటనలో మృతులకు కొవ్వూరులో పోస్టుమార్టం

● రెండు గంటల్లోనే పూర్తిచేసి పంపిన పోలీసులు, వైద్యులు

కొవ్వూరు సెప్టెంబరు 11: కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆక్రందనలతో నిండిపోయింది. వాళ్లు ఇకలేరని, ఇక రారని తెలిసి బంధువుల రోదనలతో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణమంతా తీవ్ర విషాదంతో నిండిపోయింది. ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం బొర్రంపాలెం నుంచి జీడి గింజల లోడుతో వస్తున్న డీసీఎం వ్యాన్ మంగళవారం రాత్రి దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామశివారు చిలకావారిపాకల వద్ద బోల్తాపడింది. ఈ ఘటనలో నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన 6గురు, ఉనకరమిల్లి గ్రామానికి చెందిన ఒక్కరు మృతి చెందారు. మరో వ్యక్తి గంటా మధుకు గాయాలుకాగా గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి, తర్వాత రాజమహేంద్రవరం తరలించారు. మృతిచెందిన ఏడుగురి మృతదేహాలను కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో కుటుంబసభ్యులు, బంధువులు పెద్దఎత్తున కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం గదివద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. ఒకేసారి ఏడు మృతదేహాలకు డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి ఆధ్వర్యంలో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ కె.సాయికిరణ్ పర్యవేక్షణలో డాక్టర్లు పోస్టుమార్టం పూర్తిచేశారు. కాగా తమ కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు జువ్వల రాంబాబు, ఎం.సుందరబాబు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.20లక్షల చొప్పున ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. సుమారు 2 గంటలపాటు ఆందోళన సాగింది. జీడిగింజల ఫ్యాక్టరీ యజమానులు, లారీ యజమానులను ఆసుపత్రికి రప్పించి తమకు న్యాయం చేయడంతోపాటు, ప్రమాద సంఘటనపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలియడంతో కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.చిన్నరాముడు, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవలు కొవ్వూరు ఆసుపత్రికి చేరుకున్నారు. మీకు మేము ఉన్నాం, సహాయం అందిస్తామని మృతుల కుటుంబాలకు బరోసా ఇచ్చారు. దీంతో బాధితులు కొంతమేర శాంతించారు. తమ నాయకులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు, దేవరపల్లి సీఐ ఎం.శేఖర్‌బాబుల పర్యవేక్షణలో మృతదేహాలకు పంచనామా నిర్వహించారు. అంతకుముందు జిల్లా ఎస్పీ బి.నరసింహకిషోర్ కొవ్వూరు ఆసుపత్రికి చేరుకుని వివరాలు తెలుసుకుని పోలీసులకు సూచనలు చేశారు. కాగా ఈ ఘటనకు సంబంధించి డీసీఎం వ్యాన్ డ్రైవరు, జీడిగింజల ఫ్యాక్టరీ యజమాని పరారీలో ఉన్నారు.

ఒక్కొక్క కుటుంబం.. ఒక్కో కన్నీటి కథ

నిడదవోలు, సెప్టెంబరు 11: రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు వారివి. వ్యాన్ బోల్తాపడి మృతి చెందిన వారి కుటుంబాల పరిస్థితి తెలుసుకుంటే హృదయం ద్రవించకమానదు. ఆయా మృతుల కుటుంబాల దీన స్థితి ఇదీ..

కష్టజీవి : తాడిమళ్ల గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి సత్యనారాయణ (45) రోజువారి కూలి. ఒక్క రోజు కూడా కష్టపడకుండా ఖాళీగా ఉండడు. గజం భూమి లేకపోయిన తన కొడుకులిద్దరిని ఇంజనీరింగ్ చదివిస్తున్నాడు. పెద్ద కొడుకు సురేష్ ఇంజనీరింగ్ పూర్తి కాగా, రెండవ కొడుకు రాజేష్ ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. భార్య సుభాషిణి, తల్లి వెంకటలక్ష్మిలకు తమ్మిరెడ్డి సత్యనారాయణే ఆధారం. ఏ రోజు ఏ కూలిపనికి వెళ్ళినా కూలికి వెళ్ళి వచ్చిన డబ్బులు ఇంట్లో ఇవ్వడమే తప్ప తన వద్ద ఉంచుకోడని ఏ రోజు ఖాళీ లేకుండా రోజు ఏదో ఒక కూలిపనికి వెళుతుంటాడు. అలాంటిది తమ్మిరెడ్డి సత్యనారాయణ ఆకస్మిక మృతి ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది.

కొత్త ఇంటిలోకి వచ్చి ఆరు నెలలు కాకుండానే : తాడిమళ్ల గ్రామానికి చెందిన పెనుగుర్తి చిన ముసలయ్య (35) ప్రభుత్వం ఇచ్చిన కాలనీలో ఇల్లు కట్టుకుని ఆరు నెలల కిందటే కొత్త ఇంటిలోకి వచ్చాడు. కుమారుడు గణేష్ 3వ తరగతి, కుమార్తె దుర్గా నాగమానస 2వ తరగతి చదువుతున్నారు. జీడిపిక్కల లోడుతో వస్తూ ప్రమాదవశాత్తూ మృతి చెందిన విషయం తెలిసిన నాటి నుండి మృతుని భార్య లక్ష్మీ ప్రియ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ వుంది. ఇంటి పెద్ద పెనుగుర్తి చిన ముసలయ్య ఆకస్మిక మృతి ఆ కుటుంబాన్ని విషాదంలో ముంచేసింది.

రోజు కూలి : తాడిమళ్ల గ్రామానికి చెందిన దేశాల వీర వెంకట సత్యనారాయణ (బూరయ్య) (45) కుటుంబ పోషణ కోసం కూలి పనే అతని జీవనోపాధి. గత కొన్నేళ్ళుగా జీడిపిక్కల తోటల్లో జీడిగింజలు ఏరేందుకు వెళుతున్నాడు. ఇతనికి భార్య సూర్యకుమారి, పిల్లలు నాగ సుమంత్ రవితేజ 10వ తరగతి, మోహన శ్రీసాయి 5వ తరగతి చదువుతున్న అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. ఉదయాన్నే వెళ్ళి సాయంత్రానికి ఇంటికి వస్తాడు అనుకొన్న వ్యక్తి మరణవార్త ఇంటికి రావడంతో ఆ కుటుంబం అంతా రోదనల మయం అయిపోయింది.

కూలీల మేస్త్రి : తాడిమళ్ల గ్రామానికి చెందిన కత్తవ నారాయుడు(40) తాను కలిగా పనిచేస్తూనే తనతోపాటు మరో పది మందిని కూలి పనులకు తీసుకువెళుతూ అందరితోను మేస్త్రిగా పిలిపించుకొంటూ ఉంటాడు. తనతో పాటు మరో పదిమందికి కూలి పని దొరికితే కలసి పనిచేసుకుందాము అనుకునే వ్యక్తి. టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం జీడిగింజలు ఏరుకునేందుకు వెళ్ళి వస్తూ ప్రమాదం బారిన పడి మరణించడం కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచేసింది. కుమార్తె సంజనకు పెళి చేయగా కుమారుడు వినయ్ 10వ తరగతి చదివాడు. భార్య చంద్రావతి భర్త మరణ వార్తతో శోక సంద్రంలో మునిగిపోయింది.

ఇంటికి వస్తాడని చూస్తే.. : తాడిమళ్ల గ్రామానికి చెందిన కత్తవ కృష్ణ (42) రోజు వారి కూలి పనులు చేసుకుంటూనే కుమారుడు సతీష్ బీటెక్, కుమార్తె సంధ్యారాణి 10వ తరగతి చదివిస్తున్నాడు. ఉదయం పనికి వెళ్ళిన వ్యక్తి సాయంత్రం ఇంటికి వస్తాడని ఎదురు చూస్తున్న భార్య వెంకటలక్ష్మికి కుమారుడు సతీష్ కుమార్తె సంధ్యారాణిలకు తమ ఇంటి పెద్ద తిరిగి రాని లోకాలకు వెళ్లాడని తెలియడంతో ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి.

వలసొచ్చినా.. : నిడదవోలు మండలం ఉనకరమిల్లి గ్రామంలో నివాసముంటున్న బొక్కా ప్రసాద్ (35) భార్య విజయలక్ష్మిలు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలంలోని ఎల్‌విఎన్ పురంకు చెందినవారు. భార్యాభర్తలు ఇద్దరికి కూలిపని దొరుకుతుందనే ఉద్దేశ్యంతో ఉనకరమిల్లి గ్రామంలో ఒక ఇంటిలో ఒక పోర్షన్ అద్దెకు తీసుకుని గత రెండు సంవత్సరాలుగా ఇక్కడ నివాసం ఉంటున్నారు. కుమారుడు సతీష్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుండగా కుమార్తె దేవీ ప్రియ 8వ తరగతి చదువుతుంది. ప్రసాద్ మరణవార్తతో భార్య విజయలక్ష్మి, పిల్లలు సతీష్, దేవీప్రియలు మృతుడు ప్రసాద్ మృత దేహాన్ని ఉంచిన కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళిపోయారు.

రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం



తాడి మణి, మానసిక దివ్యాంగురాలు (మృతుడు తాడి కృష్ణ కుమార్తె)

నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన తాడికృష్ణ (42) కూలి పనులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. భార్య దుర్గ భర్తకు చేదోడు వాదోడుగా ఉంటోంది. వీరికి కుమారుడు గణేష్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుండగా కుమార్తె మణికి మాటలురావు పైగా మానసిక దివ్యాంగురాలు. మృతుని తల్లి తాడి నాగమ్మ సైతం వీరితోనే కలసి ఉంటోంది. వీరందరికి తాడి కృష్ణే దిక్కు. ఇతను చేసే కూలి కష్టంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అలాంటి ఇంటికి పెద్ద దిక్కు తాడి కృష్ణ ఆకస్మిక మరణం ఈ కుటుంబాన్ని అనాథపాలు చేసింది.



కొవ్వూరు గోష్పాదక్షేత్రం రహదారులపై ప్రవహిస్తున్న వరద నీరు



పెరవలి: తీపర్రు వద్ద పుష్కర రేవులో శివుడి పాదాల వద్దకు చేరిన గోదావరి వరద

కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని ముంచెత్తిన వరద

వరద ఉధృతిని పరిశీలించిన కొవ్వూరు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ



మద్దూరులంక పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ.

కొవ్వూరు, సెప్టెంబర్ 11: అఖండ గోదావరికి మూడోసారి వరద పోటెత్తింది. గోదావరినది ఎగువ ప్రాంతాలలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు, ఉపనదులు పొంగి ప్రవమిస్తున్నాయి. వాటి నుంచి అధికసంఖ్యలో వరద ప్రవాహం వచ్చి గోదావరిలో చేరడంతో నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం, దిగువన ధవళేశ్వరం బ్యారేజీలవద్ద ప్రమాద హెచ్చరికలు దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బ్యారేజీకు ఉన్న ధవళేశ్వరం, ర్యాలి, మద్దూరులంక, విజ్జేశ్వరం ఆరమ్‌లలోని 175 గేట్లను పూర్తిగా ఎత్తివేసి ఎప్పటికప్పుడు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని వరద గోదావరి ముంచెత్తింది. బుధవారం కొవ్వూరు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, పట్టణ సీఐలు గోష్పాదక్షేత్రంలో వరద ఉధృతిని పరిశీలించారు. నదీ ప్రవాహం ప్రమాదకరంగా ఉన్నందున స్నానఘట్టాలు, క్షేత్రంలోకి ఎవ్వరూ దిగకుండా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గస్తీ ఏర్పాటుచేశారు. క్షేత్రంలోకి వచ్చే రోడ్డు ప్రధాన రహదారులు, ఆలయాలన్నీ నీట మునిగాయి. అదేవిధంగా కొవ్వూరు మండలం మద్దూరులంకలోని ముంపు ప్రాంతం పల్లిపాలెంలో నివసిస్తున్న 17 కుటుంబాలకు చెందిన 49 మందిని మద్దూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఇంచార్జి తహసీల్దార్ కె.అజయ్‌బాబులు పునరావాస కేంద్రాన్ని సందర్శించి అక్కడికి వచ్చిన ప్రజల నుంచి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

ఉధృతంగా గోదావరి

పెరవలి: గోదావరి ఎగువ భాగం నుంచి వస్తున్న వరద నీటితో ఈ ప్రాంతంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రానికి నాలుగు అడుగుల మేర నీరు పెరగడంతో పల్లపులంక భూములతో పాటు పై లంక భూములు కూడా నీట మునుగుతున్నాయి. వరద ఉధృతి ఇదేవిధంగా ఉంటే గురువారం సాయంత్రానికి మొత్తం లంక భూములన్నీ నీట మునుగుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లంకభూముల్లో వివిధ రకాల పంటలు అరటి, కంద, వివిధ రకాల కూరగాయల పంటలతో పాటు పచ్చగడ్డి బీడులు పాడైపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే లంకభూముల్లో గల పశువులను ఏటిగట్టుపైకి చేర్చాలని తహసీల్దార్ అచ్యుతకుమారి, పశువైద్యురాలు డాక్టర్ సల్మా, గోదావరి పరివాహక గ్రామాలు పర్యటించి రైతులను కలుసుకుని వారికి తగిన సూచనలు ఇచ్చారు.

నేటి నుంచి థర్మల్ డ్రోన్‌తో

చిరుతపులి గాలింపు



దివాన్‌చెరువు, సెప్టెంబరు 11: 'చిరుత పులి జాడను గుర్తించేందుకు గురువారం నుంచి థర్మల్ డ్రోన్ వినియోగిస్తాం... ఇందుకు ప్రత్యేక బృందం వస్తోందని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి బుధవారం రాత్రి తెలిపారు. గత రెండు రోజులుగా సాధారణ డ్రోన్ సహాయంతో గాలించినా చిరుతపులి జాడ కనిపించలేదన్నారు. దీంతో థర్మల్ డ్రోన్ రప్పించామని చెప్పారు. దానిని ఆపరేట్ చేసేందుకు కుడా అనుభవజ్ఞులైన ఆపరేటర్లు ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో వేరే ప్రాంతం నుంచి తీసుకు వస్తున్నామన్నారు. థర్మల్ డ్రోన్‌తో పగటి పూటతో పాటు రాత్రి కూడా గాలింపు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా బుధవారం కూడా ట్రాప్ కెమెరాలో చిరుత పులి జాడ కనిపించలేదన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం కోసం ట్రాప్ కెమెరాల అమరికలో మార్పులు చేసినట్లు చెప్పారు. చిరుత సంచారం బట్టి అనుమానాస్పద ప్రాంతంలో రెండు ట్రాప్ బోనులను స్థానాలు మార్చి దానిని పట్టుకునేందుకు పూర్తి ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

శ్రీ లక్ష్మీ నారాయణస్వామికి విశేష పూజలు

నిడదవోలు, సెప్టెంబరు 11: నిడదవోలు మండలం మునిపల్లి గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నారాయణస్వామికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 7 వారాలు 11 ప్రదక్షణలు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వేడుకగా గణపతి నవరాత్రి ఉత్సవాలు



శ్రీకృష్ణతులాభారం నాటకం ప్రదర్శిస్తున్న దృశ్యం

చాగల్లు, సెప్టెంబరు 11: మండల కేంద్రమైన చాగల్లులో తెలగా సంఘం వారి ఆధ్వర్యంలో 69 సంవత్సరాలుగాను, చాగల్లు, నెలటూరు వర్తకసంఘం ఆధ్వర్యంలో 68 సంవత్సరాలుగాను శ్రీగణపతి నవరాత్రి ఉత్స వాలు పోటాపోటీగా ఉత్సాహంగా నిర్వహి స్తుంటారు. దేవతా మూర్తుల ఆకారంలో భారీ ఎత్తున విద్యుత్ దీపాల అలంకరణలతో ఆకర్షణీయంగా ఏర్పాట్లు చేస్తారు. పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలు ప్రదర్శించడంతో పాటుగా మ్యూజికల్ నైట్‌లు, కూచిపూడి, జానపద నాట్యాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉత్తమ విద్యార్థులను సన్మానించి బంగారు పతకాలు అందజేయడం, సినీనటులను, రంగస్థల కళాకారులను సన్మానించడం కళలను ప్రోత్సహించడం జరుగుతాయి. ఈ సంవత్సరం ఉత్సవాలు వేడుకగా వైభవంగా జరుగుతున్నాయి. ప్రముఖుల ఆధ్యాత్మిక ప్రవచనాలు, ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతున్నాయి. గురువారంరాత్రి తెలగా సంఘం కళావేదికపై జరిగే కార్యక్రమంలో సినీనటుడు రవిక్రిష్ణ, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావులతోపాటుగా ఉత్తమ విద్యార్థులకు సన్మానం జరుగనుంది. ముఖ్యఅతిథిగా ప్రముఖ దర్శకుడు వీవీ వినాయక్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొంటారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తు పరిశీలన

తాళ్లపూడి, సెప్టెంబరు 11 :తాళ్లపూడి మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 41 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తాళ్లపూడి తహసీల్దార్ బీరా రవీంద్రనాద్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిని కాకినాడ కలెక్టరేట్‌కి తీసుకు వెళుతున్నామని, వచ్చిన దరఖాస్తులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 24న తిరిగి కొత్తగా దరఖాస్తు నమోదుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం

దేవరపల్లి, సెప్టెంబరు 11: దేవరపల్లి మండలం యర్నగూడెంలోని అలివేలుమంగ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాభి వృద్ధికి దేవరపల్లి గ్రామానికి చెందిన నూలు వెంకట శ్రీనివాస్ దంపతులు రూ.లక్ష విరాళం ఆలయకమిటీ చైర్మన్ శ్రీకాకుళపు కాశీవిశ్వనాధానికి అందజేశారు.

వరద సహాయ నిధికి

ప్రతిఒక్కరూ విరాళాలు అందించాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబర్ 11 : వరద బాధితులకు సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ప్రతిఒక్కరూ విరాళాలు అందించి సహకరించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొవ్వూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన నాయకుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బుడమేరు కాలువకు గండి పడడంతో విజయవాడ అతలాకుతలమైందన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలెక్టరేట్‌నే ముఖ్యమంత్రి కార్యాలయంగా చేసుకుని ప్రజలకు సేవలు అందించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు అందజేస్తున్నారన్నారు. వరద బాధితుల సహాయార్థం సాయం అందించడానికి దాతలు ముందుకు రావాలన్నారు. కొవ్వూరు నియోజకవర్గం నుంచి తమవంతుగా రూ.కోటికి తగ్గకుండా విరాళం అందజేయాలని నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని పట్టణ, మూడు మండలాలల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాతృత్వాన్ని చాటుకోవాలన్నారు. సేకరించిన విరాళాన్ని డిడి రూపంలో, దాతల పేర్లతో ముఖ్యమంత్రికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటి సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ, ఎంపిపి కాకర్ల నారాయుడు, మద్దిపాటి సత్యనారాయణ, పొట్రు మురళీ, తోరం నగేష్, నామాన పరమేష్, నాదెళ్ళ శ్రీరామ్, ఆళ్ళ హరిబాబు, సర్పంచ్‌లు పాలడుగుల లక్ష్మణరావు, మేకల శ్రీను మూడు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్దు

● మాలమహానాడు నాయకులు



నల్లజర్ల బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న మాలలు

నల్లజర్ల, సెప్టెంబరు 11: ఎస్సీ వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్దు అంటూ నినాదాలతో నల్లజర్ల సెంటర్ మార్మోగింది. ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నల్లజర్లలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పోలీస్‌స్టేషన్ నుంచి పాదయాత్రగా నల్లజర్ల బస్‌స్టాండ్‌కు చేరుకుని అక్కడ ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణారావుకు డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక అసమానతలు, అంటరానితనం ఆధారంగా ఎస్సీలకు లభించిన రిజర్వేషన్‌లను వర్గీకరించడం ద్వారా ఐక్యమత్యంగా ఉన్న ఎస్సీల మధ్య చిచ్చు పెట్టే వర్గీకరణ ప్రయత్నాలు విరమించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుదే సుబ్బారావు, పిల్లి కాంతారావు, సుంకు ప్రభాకరావు, చావ్వాకుల దర్మరాజు, వీరమల్ల అనిల్‌కుమార్, బొడిగడ్ల వెంకటేశ్వరరావు, మన్నె రాంబాబు, గుదే శ్రీనివాస్, గుదే కిరణ్, అప్పన్న, ఉదయ్, తోట వెంకట్రావు పాల్గొన్నారు

'మంద కృష్ణ మాటలు సరైనవికాదు'

కొవ్వూరు, సెప్టెంబర్ 11 : మంద కృష్ణ మాదిగ మాటలు అదుపులో పెట్టుకోవాలని మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంతా శ్యాం రవిప్రకాష్ అన్నారు. ఆలిండియా దళిత సంఘాల పిలుపుమేరకు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే ప్రతిఘటన కార్యక్రమానికి మద్దతుగా కొవ్వూరు మెరకవీధి అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం మాలమహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ మాసా ఆనంద్ అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. శ్యాం రవిప్రకాష్ మాట్లాడుతూ మాలలను ఉన్మాదులుగా, మనువాదులుగా మాట్లాడడాన్ని ఖండించారు. మాసా ఆనంద్ మాట్లాడుతూ సుప్రీం తీర్పును రివ్యూ చేసే వరకు పోరాటం ఆగదని, రానున్న రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. సాకా పుల్లారావు, పీతల చింటూ, చిన్నా, బంగార్రాజు,పాల్గొన్నారు.